www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్
21 ఆగస్టు 2026
సంపుటి:4 సంచిక: 226

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

## హరీశ్ వర్సెస్ పొంగులేటి

- 22ఏ నిషేధిత భూములపై అధికార, ప్రతిపక్ష పోరు
- హరీశ్ రావు ఆరోపణలకు పొంగులేటి ఘాటు కౌంటర్
- కమీషన్లు, అవినీతిపై మంత్రి తీవ్ర వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ ప్రతిపక్షంగా విఫలమైందన్న పొంగులేటి
- కాళేశ్వరం, ధరణి, మెడికల్ కాలేజీలపై ఆరోపణలు
- భూముల అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మాటల యుద్ధం




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో 22ఏ నిషేధిత భూముల వ్యవహారం మరోసారి హీట్ పెంచింది. ప్రైవేటు భూములను 22ఏ జాబితాలో చేర్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన ఆరోపణలు అధికార కాంగ్రెస్‌లో తీవ్ర ప్రతిస్పందనకు కారణమయ్యాయి. ఈ అంశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఘాటుగా స్పందించారు. తనపై వచ్చిన ఆరోపణలను ఖండించిన ఆయన, హరీశ్ రావు కమీషన్లు, అవినీతి గురించి మాట్లాడటం హంతకుడే సంతాపం తెలిపినట్లుగా ఉందంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 22ఏ భూముల సమస్యపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ప్రతిపక్షం డిమాండ్ చేస్తుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం గత పాలనలో

మిగతా 3లో..



## రూ.100 కోట్ల ఆస్తులు.. ఎలా?

### శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో భారీగా అక్రమాస్తుల గుర్తింపు

- కిలోకు పైగా బంగారం స్వాధీనం
- 8 ఖాళీ స్థలాలు, 10 ఎకరాల భూమి గుర్తింపు
- హస్తినాపురంలో మూడంతస్తుల భవనం
- కుమారుడి పేరిట బార్‌లో రూ.86 లక్షల పెట్టుబడి
- ఆస్తుల విలువ రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో అడ్మిన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో ఏసీబీ అధికారులు భారీగా ఆస్తులు గుర్తించారు. ఆదాయ వనరులతో పోలిస్తే ఆస్తులు అసాధారణంగా పెరిగినట్లు ప్రాథమికంగా గుర్తించిన అధికారులు, అందుకు

మిగతా 2లో..



## నాకేం సంబంధం లేదు

- మంత్రి కొండా సురేఖ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి లిఖితపూర్వక వివరణ
- కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు
- కుటుంబ బంధాన్ని ఆసరాగా చేసుకుని రాజకీయ నెపం మోపుతున్నారు
- ఆగస్టు 19న జన్మదిన వేడుకల్లో కుమార్తె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు
- వ్యక్తిగత అభిప్రాయాలకు తనను బాధ్యురాలిని చేయడం తగదని అభ్యంతరం
- నోటీసును తక్షణమే ఉపసంహరించుకోవాలని కమిటీని కోరారు

03



## కాంగ్రెస్‌కి కష్టకాలం మొదలైందా?

- కాంగ్రెస్‌కు పెరుగుతున్న వ్యతిరేకత
- విద్యార్థుల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆగ్రహం
- ఉద్యోగులు, పెన్షనర్లలో అసంతృప్తి
- సింగరేణిలో వారసత్వ ఉద్యోగాల డిమాండ్
- భూభారతిపై 22ఏ వివాదం
- అవినీతి ఆరోపణలతో సర్కారుపై ఒత్తిడి

కాంగ్రెస్ ప్రభుత్వంపై రాష్ట్రంలో అసంతృప్తి క్రమంగా విస్తరిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. సామాన్యుల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, సింగరేణి కార్మికులు, నిరుద్యోగుల వరకు వివిధ వర్గాల నుంచి డిమాండ్లు, నిరసనలు పెరుగుతున్నాయి. మరోవైపు రేవంత్ మంత్రివర్గంలోని కొందరు నేతలపై వ్యక్తిగత అవినీతి ఆరోపణలు రాజకీయ వేడిని పెంచుతున్నాయి. పార్టీలోనే ఆధిపత్య పోరు, విభేదాలు బయటపడుతుండటంతో ప్రభుత్వానికి సమస్యలు ఒకదాని తర్వాత ఒకటి ఎదురవుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్‌కు కష్టకాలం మొదలైందా అన్న చర్చ తెలంగాణ రాజకీయ వర్గాల్లో మొదలైంది. ప్రభుత్వంపై వ్యతిరేకతకు ప్రధాన కారణంగా హామీల అమలులో జాప్యాన్ని ఉద్యోగ సంఘాలు చూపుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ సంఘాలు కార్యాచరణకు సిద్ధమవుతున్నాయి.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ప్రభుత్వం చర్చలకు పిలిచి పరిష్కార మార్గం చూపితే పరిస్థితి సద్దుమణిగే అవకాశం ఉంటుంది. లేకపోతే రాజకీయంగా ఈ అంశాలు మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశం విద్యార్థుల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. గత బకాయిలు సుమారు రూ.10 వేల కోట్ల వరకు ఉన్నాయని ప్రతిపక్షాలు చెబుతున్నాయి. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి బకాయిల విడుదల ప్రారంభిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా, ఇప్పటివరకు స్పష్టమైన పురోగతి కనిపించలేదన్న విమర్శలు ఉన్నాయి. ఫలితంగా కళాశాలల ఫీజులు, విద్యార్థుల చదువు,

మిగతా 3లో..

## తెలుగులో లెటర్ రాయడం వచ్చా రేవంత్?

- జీవో 97 రద్దు చేయాలని పాలిటెక్నిక్ విద్యార్థుల డిమాండ్
- శక్తి స్కీమ్‌పై విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన
- ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని విజ్ఞప్తి
- పోలీసుల తీరుపై విద్యార్థుల తీవ్ర ఆగ్రహం
- సీఎం రేవంత్‌రెడ్డిపై విద్యార్థుల ఘాటు ప్రశ్నలు
- డిప్లొమా విద్య భవిష్యత్‌పై ఆందోళన




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ ప్రభుత్వం 'శక్తి' పేరుతో పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేస్తూ జారీ చేసిన జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రామోజీ ఫిలిం సిటీ వద్ద పలు పాలిటెక్నిక్ కాలేజీలకు చెందిన విద్యార్థులు నిరసన చేపట్టారు. జీవో 97 వల్ల తమ విద్యా విధానం, భవిష్యత్ అవకాశాలపై అనిశ్చితి ఏర్పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సమస్యను పరిష్కరించకుండా కొత్త విధానాన్ని అమలు చేయడం సరికాదని పేర్కొన్నారు. ఉన్న వ్యవస్థలో లోపాలు ఉంటే వాటిని సరిదిద్దాలని కోరారు. ఈ నిర్ణయం అమల్లోకి

మిగతా 3లో..



## కాంగ్రెస్ పార్టీకి దేశభక్తి అర్థం కాదు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు
- ఫీజు బకాయిలపై విద్యార్థులకు అండగా బీజేపీ పోరాటం
- రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు

02

## ఉమ్మడి నల్లగొండలో గులాబీ గుబులు

- ఎంసీ కోటిరెడ్డి తీరుపై కేడర్ అసంతృప్తి
- ప్రతిపక్షంలో ఎమ్మెల్సీ మౌనంపై చర్చ
- సాగర్‌లో వర్గ విభేదాలపై ఆరోపణలు
- ప్రజా సమస్యలపై స్పందన లేదన్న విమర్శ
- నియోజకవర్గాల పర్యటనకు దూరంగా ఉన్నారన్న ఆరోపణ

02



## ఉచిత వైద్యానికి ప్రైవేట్ బ్రేక్!

- గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రైవేట్ ల్యాబ్‌లకు రోగుల రెఫర్
- ఉచిత పరీక్షలు ఉన్నా బయటకు పంపుతున్నారన్న ఆరోపణలు
- పరీక్షల పేరుతో పేదలపై వేల రూపాయల భారం
- ప్రైవేట్ ల్యాబ్ ఏజెంట్లపై ఎంపీ రఘునందన్ రావు ఆగ్రహం
- ఏళ్ల తరబడి ఒకేచోట సిబ్బంది తిష్టపై విమర్శలు
- కోట్లతో నిర్మించిన 20 డాక్టర్ క్వార్టర్లు నిరుపయోగం

03





## ఫిలిప్పీన్స్‌లో ఇండియన్ ఎంబసీని సందర్శించిన ఎన్నారై అడ్వైజరీ కమిటీ

- మనీలాలో కమిషన్ ఆన్ ఫిలిప్పీన్స్ ఓవర్సీస్ అధికారులతోనూ భేటీ
- ఉత్తమ వలస విధానాలపై చర్చలు
- గల్ఫ్ కార్మికుల కోసం మెరుగైన వలస విధానాల కోసం కృషి చేస్తాం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి వెల్లడి

08

## ఆందోళనలో రైతన్న



- తొమ్మిది జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు
- వర్షపాతం లోటుతో నేలలో తగ్గుతున్న తేమ
- 13 జిల్లాల్లో 33 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- సాగు విస్తీర్ణం 107.17 లక్షల ఎకరాలకు చేరిక
- రానున్న రెండు వారాలు కీలకం
- నెలాఖరులో వర్షాలు కురిసే అవకాశం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణలో వానాకాలం పంటల సాగు కీలక దశకు చేరుకున్న వేళ వాతావరణ పరిస్థితులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, మరికొన్ని ప్రాంతాల్లో రుతుపవన వర్షాల లోటు కొనసాగుతోంది. ముఖ్యంగా తొమ్మిది జిల్లాల్లో వేడి తీవ్రతతో పాటు వర్షాభావ పరిస్థితులు నెలకొనడం వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. సూర్యాపేట, నల్గొండ, ఖమ్మం, మహబూబాబాద్, నారాయణపేట, జనగామ, జోగులాంబ గద్వాల, భద్రాద్రి కొత్తగూడెం, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో సాధారణ స్థాయికి మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇదే సమయంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. వర్షపాతం లోటు కారణంగా ఆయా జిల్లాల్లో నేలలో తేమ తగ్గే పరిస్థితి ఏర్పడుతోంది. అధిక ఉష్ణోగ్రతలు కొనసాగితే భూమిలోని తేమ ఆవిరయ్యే వేగం మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. మొక్కలకు అవసరమైన తేమ అందుబాటులో లేకపోతే వేర్ల అభివృద్ధి, పోషకాల స్వీకరణ, మొక్కల ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడవచ్చు. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో పరిస్థితి మరింత సున్నితంగా మారే అవకాశం ఉంది. సాగునీటి వనరులు పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో రైతులు అదనపు నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. వర్షాధార పంటలకు ఈ పరిస్థితి మరింత కీలకంగా మారింది. నేలలో తేమ నిల్వ ఉండేలా తగిన వ్యవసాయ పద్ధతులు పాటించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. రాష్ట్రంలోని మొత్తం 13 జిల్లాల్లో సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 33 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా నమోదయ్యాయి. హైదరాబాద్, పెద్దపల్లి, వరంగల్, వనపర్తి జిల్లాల్లోనూ 33 డిగ్రీలు అంతకంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పగటి వేళ వేడి పెరగడంతో పంటల నుంచి

మిగతా 2లో..

# కాంగ్రెస్ పార్టీకి దేశభక్తి అర్థం కాదు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంచదర్ రావు కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు
- ఫీజు బకాయిలపై విద్యార్థులకు అండగా బీజేపీ పోరాటం
- రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు
- 20 లక్షల మంది విద్యార్థులు ఎదురుచూపులు
- కరీంనగర్‌లో బీజేవైఎం మహాధర్నా
- బకాయిలు విడుదలయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని వెల్లడి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ పార్టీకి దేశభక్తి, ప్రజల ఆవేదన అర్థం కావడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. కలోనియల్ మైండ్‌సెట్‌తో ఉన్న ఆ పార్టీకి విద్యార్థుల సమస్యలు కూడా కనిపించడం లేదని ఆరోపించారు. కరీంనగర్‌లో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫీజు బకాయి - బీజేపీ లడాయి' మహాధర్నాలో పాల్గొన్న ఆయన ప్రసంగించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీజు బకాయిల సమస్యపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని ఆయన కోరారు. విద్యార్థులకు వెంటనే న్యాయం చేయకపోతే నిరసనలు కొనసాగుతాయని హెచ్చరించారు. వందేమాతరం విషయంలో కాంగ్రెస్ వైఖరిపై రామచందర్ రావు మండిపడ్డారు. 1937లో వందేమాతరం గీతాన్ని రెండే రెండు చరణాలు పాడాలని కాంగ్రెస్ పార్టీ షరతు పెట్టిందని పేర్కొన్నారు. ఆ సమయంలో దేశం బ్రిటిష్ పాలనలో ఉందని గుర్తుచేశారు. ఒక బ్రిటిషర్ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీలో వచ్చిన ప్రతిపాదనను భారతీయులు ఎందుకు అంగీకరించాలని ప్రశ్నించారు. ముస్లిం లీగ్‌కు తలవంచి వందేమాతరం మొత్తం పాడకుండా రెండే చరణాలు పాడుతామని ప్రకటించారని ఆరోపించారు. ఇప్పుడు అదే ప్రతిపాదనను మరోసారి ముందుకు తేవడం దేశాన్ని అవమానించడమేనని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్య సమరయోధులు వందేమాతరాన్ని దేశ చైతన్యానికి ప్రతీకగా చూశారని చెప్పారు. ఆ చరిత్రను వక్రీకరించడం సరికాదని అన్నారు. జాతీయ గౌరవానికి సంబంధించిన అంశాల్లో రాజీ ధోరణి తగదని వ్యాఖ్యానించారు. వందేమాతరం నినాదంతోనే స్వాతంత్ర్య పోరాటానికి స్ఫూర్తి లభించిందని రామచందర్ రావు అన్నారు. అలాంటి గీతాన్ని కాంగ్రెస్ పార్టీ అవమానించిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఆలోచనా విధానం విదేశీ ప్రభావంతో కొనసాగుతోందని ఆరోపించారు. ఆ పార్టీని ఒక విదేశీయుడు స్థాపించాడని, అందువల్ల దాని ఆలోచనల్లో కలోనియల్ మైండ్‌సెట్ కనిపిస్తోందని పేర్కొన్నారు. దేశభక్తి అంటే ఏమిటో కాంగ్రెస్‌కు అర్థం కావడం లేదని అన్నారు. దేశ ప్రజల బాధను అర్థం చేసుకోలేని పరిస్థితిలో ఉన్న పార్టీకి విద్యార్థుల కష్టాలు ఎలా అర్థమవుతాయని ప్రశ్నించారు. వందేమాతరం అంశాన్ని దేశ గౌరవంతో ముడిపెట్టారు. దేశభక్తి విషయంలో ప్రజలకు పాఠాలు చెప్పే హక్కు కాంగ్రెస్‌కు లేదని విమర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను యువతకు వాస్తవాలతో తెలియజేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యార్థుల్లో జాతీయ భావనను బలపరచాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల పరిస్థితిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం సుమారు రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను మిగిల్చి వెళ్లిందని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పెండింగ్ నిధులను పూర్తిగా విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. బకాయిలు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు, వారి కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతోందని పేర్కొన్నారు. ఫీజు బకాయిలు పేరుకుపోవడంతో విద్యార్థుల నుంచి అదనపు ఒత్తిడి ఎదురవుతోందని చెప్పారు. తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లించే పరిస్థితి వస్తోందని పేర్కొన్నారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. కాలేజీ యాజమాన్యాలకు ప్రభుత్వం నుంచి నిధులు అందకపోవడంతో విద్యాసంస్థలు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నాయని రామచందర్ రావు అన్నారు. అధ్యాపకులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి అనేక చోట్ల ఏర్పడిందని చెప్పారు. నిర్వహణ వ్యయాలు పెరగడం, బకాయిలు పేరుకుపోవడంతో కొన్ని విద్యాసంస్థలు మూతపడే దిశగా నెట్టబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉన్నత విద్యకు ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. ప్రభుత్వం బకాయిలను ఆలస్యం చేయడం వల్ల విద్యార్థులు చదువును కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నిధుల విడుదలకు స్పష్టమైన కాలపట్టిక ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కళాశాలలకు నిధులు సకాలంలో అందితేనే బోధనా వ్యవస్థ సజావుగా కొనసాగుతుందని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ ప్రకటించిన యూత్ డిక్లరేషన్ హామీలు ఏమయ్యాయని రామచందర్ రావు ప్రశ్నించారు. యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడం విద్యార్థులపై ప్రభుత్వం చూపాల్సిన కనీస బాధ్యత అని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి రూపాయి బకాయి విడుదలయ్యే వరకు భారతీయ జనతా పార్టీ విద్యార్థులకు అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి నిధులు విడుదల చేయించే వరకు పోరాటం ఆపబోమని తెలిపారు. యువతకు ఉద్యోగాలు, విద్య, ఆర్థిక భరోసా కల్పిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తు చేసుకోవాలని అన్నారు. మాటలు కాకుండా నిధులు విడుదల చేసి కార్యాచరణ చూపాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళనను తేలికగా తీసుకోవద్దని హెచ్చరించారు. కరీంనగర్‌లో జరిగిన మహాధర్నాకు విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతి కుమార్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుందే, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, నగర మేయర్ శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ పాల్గొన్నారు. నాయకులు విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిల కారణంగా విద్యార్థుల చదువులు మధ్యలో ఆగిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బకాయిల విడుదలలో ఆలస్యం కొనసాగితే ఆందోళనలను మరింత విస్తరిస్తామని బీజేపీ నేతలు హెచ్చరించారు. విద్యార్థుల హక్కుల కోసం రాజకీయాలకు అతీతంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ మొత్తాన్ని విడుదల చేస్తే విద్యార్థులకు, విద్యాసంస్థలకు ఊరట లభిస్తుందని పేర్కొన్నారు. ఇదే బీజేపీ ప్రధాన డిమాండ్ అని ఆయన తెలిపారు.

## రూపా రెడ్డి హత్యకు నిరసనగా నేడు రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్

- ట్రస్మా ఆధ్వర్యంలో నిరసనకు పిలుపు
- ట్రస్మా జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ వెల్లడి

**విశాలభారతి, నిర్మల్ ప్రతినిధి:** నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ రూపా రెడ్డి హత్యకు నిరసనగా శుక్రవారం (21082026) ట్రస్మా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు ట్రస్మా నిర్మల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. రూపా రెడ్డి హత్యను ఖండిస్తూ ఇప్పటికే నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాలు, గ్రామాల్లో ఉపాధ్యాయులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారని పేర్కొన్నారు. ఈ ఘటనపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చినట్లు వెల్లడించారు. విద్యారంగానికి చెందిన వారిపై, ముఖ్యంగా ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలపై దాడులు జరగడం ఆందోళనకరమని ట్రస్మా నాయకులు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్స్‌కు తగిన భద్రత కల్పించాలని కోరారు. రూపా రెడ్డి కుటుంబానికి న్యాయం జరిగేలా హత్యకు బాధ్యులైన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు నిరసనగా ఆగస్టు 21న నిర్మల్ జిల్లాలోని పాఠశాలలు బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్, వెంకటేశ్వర రావు, జిల్లా కార్యదర్శి పడల ప్రభాకర్, నిర్మల్ పట్టణ అధ్యక్షుడు అయ్యన్నగారి శ్రీధర్, చంద్ర గౌడ్, నిర్మల్ ప్రధాన కార్యదర్శి జి. శ్యామ్ ప్రకాశ్, పద్మనాభం గౌడ్ తదితరులు పాల్గొని రూపా రెడ్డి హత్యను తీవ్రంగా ఖండించారు.



## రూ.100 కోట్ల ఆస్తులు.. ఎలా?



**మొదటిపేజీ తరువాయి**

సంబంధించిన పత్రాలు, ఆస్తుల వివరాలను సేకరించారు. ఈ తనిఖీల్లో నగదు, బంగారం, భూములు, భవనాలు, వాహనాలు, బ్యాంకు నిల్వలు, పెట్టుబడులకు సంబంధించిన సమాచారం వెలుగులోకి వచ్చింది. కేసు దర్యాప్తులో భాగంగా ఆస్తుల కొనుగోలు, పెట్టుబడుల వెనుక ఉన్న నిధుల మూలాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఏసీబీ దర్యాప్తులో భాగంగా ఆస్తుల పత్రాలను ఒక్కొక్కటిగా పరిశీలించి, వాటి యాజమాన్య హక్కులను నిర్ధారించే అవకాశం ఉంది. భూముల రిజిస్ట్రేషన్ వివరాలు, భవన నిర్మాణ అనుమతులు, బ్యాంకు లావాదేవీలు, పెట్టుబడి ఒప్పందాలను పరస్పరం సరిపోల్చనున్నారు. కుటుంబ సభ్యుల ఆర్థిక వ్యవహారాలు కూడా పరిశీలనలోకి తీసుకునే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో సాధారణంగా ఉద్యోగి సంపాదించిన చట్టబద్ధమైన ఆదాయం, కుటుంబానికి ఉన్న ఇతర ఆదాయ వనరులు, ఆస్తుల కొనుగోలు వ్యయం మధ్య వ్యత్యాసాన్ని లెక్కిస్తారు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ వెల్లడించిన వివరాల ప్రకారం శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో కిలోకు పైగా బంగారం గుర్తించారు. బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువుల వివరాలను అధికారులు నమోదు చేశారు. ఇంట్లో రూ.4 లక్షల నగదు కూడా లభించినట్లు తెలిపారు. నగదు, బంగారం విలువను మార్కెట్ ధరల ఆధారంగా లెక్కించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న ఆస్తుల వివరాలను సైతం పరిశీలిస్తున్నారు. ఆదాయానికి సరిపడని ఆస్తుల కొనుగోలు జరిగిందా, వాటి కోసం ఏ మార్గాల్లో డబ్బు సమకూరిందనే అంశాలపై విచారణ కొనసాగుతోంది. కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న ఆస్తుల వెనుక నిధుల మూలాలను కూడా పరిశీలించే అవకాశం ఉంది. నగదు, బంగారం స్వాధీనం వివరాలను నమోదు చేసిన అధికారులు, వాటి విలువను లెక్కించే ప్రక్రియ చేపట్టారు. బంగారం కొనుగోళ్లకు సంబంధించిన బిల్లులు, ఇతర ఆధారాలు ఉన్నాయా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. గుర్తించిన వస్తువుల విలువను తుది లెక్కల్లో చేర్చనున్నారు. తనిఖీల్లో 8 ఖాళీ స్థలాలు ఉన్నట్లు గుర్తించారు. వాటి స్థానం, విస్తీర్ణం, కొనుగోలు చేసిన తేదీలు, రిజిస్ట్రేషన్ విలువలను అధికారులు పరిశీలిస్తున్నారు. యాచారంలో 10 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించిన ఏసీబీ, ఆ భూమికి సంబంధించిన పత్రాలను సేకరించింది. భూమి కొనుగోలు సమయంలో చెల్లించిన మొత్తం, ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువ, భూమి కొనుగోలుకు ఉపయోగించిన ఆర్థిక వనరులపై దృష్టి సారించింది. ఖాళీ స్థలాలు, వ్యవసాయ భూములన్నింటినీ కలిపి వాటి ప్రస్తుత బహిరంగ మార్కెట్ విలువను అంచనా వేయడానికి సంబంధిత రికార్డులను పరిశీలిస్తున్నారు. సాధారణంగా ఇలాంటి కేసుల్లో రిజిస్ట్రేషన్ విలువతో పాటు ప్రస్తుత మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకుంటారు. భూముల కొనుగోలుకు ఉపయోగించిన బ్యాంకు లావాదేవీలను కూడా పరిశీలించే అవకాశం ఉంది. పత్రాల్లో నమోదైన వివరాలను క్షేత్రస్థాయి పరిశీలనతో సరిపోల్చనున్నారు. ఈ ఆస్తులపై ఇతరుల హక్కులు ఉన్నాయా అనే అంశాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. హస్తినాపురంలో శ్రీనివాస్‌రెడ్డి పేరుతో మూడంతస్తుల భవనం ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. భవనం నిర్మాణానికి అయిన వ్యయం, నిర్మాణ విస్తీర్ణం, ఉపయోగించిన సామగ్రి, నిర్మాణ సమయంలో జరిగిన చెల్లింపుల వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. భవనం నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, ఆస్తి పత్రాలు, పన్ను రికార్డులను కూడా సేకరించే ప్రక్రియ కొనసాగుతోంది. మరోవైపు శ్రీనివాస్‌రెడ్డి కుమారుడి పేరిట ఓ బార్‌లో రూ.86 లక్షల పెట్టుబడి ఉన్నట్లు గుర్తించారు. ఈ పెట్టుబడికి సంబంధించిన ఒప్పందాలు, చెల్లింపుల వివరాలు, ఆదాయ వనరులను అధికారులు పరిశీలిస్తున్నారు. పెట్టుబడి ఎప్పుడు జరిగింది, నిధులు ఏ ఖాతా నుంచి వెళ్లాయి, వ్యాపారంలో వాటా ఎలా ఉంది అనే వివరాలను సేకరించే అవకాశం ఉంది. కుటుంబ సభ్యుల పేర్లతో ఉన్న వ్యాపార పెట్టుబడులను కూడా ఆదాయ లెక్కల్లో పరిశీలించనున్నారు. భవనం నిర్మాణ వ్యయాన్ని ప్రస్తుత ధరల ఆధారంగా కాకుండా సంబంధిత కాలానికి అనుగుణంగా లెక్కించే అవకాశం ఉంది. పన్ను చెల్లింపుల వివరాలు కూడా దర్యాప్తులో కీలకంగా మారనున్నాయి. శ్రీనివాస్‌రెడ్డి పేరిట లేదా కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న ఏడు బ్యాంకు ఖాతాల్లో మొత్తం రూ.8 లక్షల నగదు నిల్వ ఉన్నట్లు గుర్తించారు. ఈ ఖాతాల్లో ఇటీవలి కాలంలో జరిగిన లావాదేవీలను అధికారులు పరిశీలిస్తున్నారు. జీతం, ఇతర చట్టబద్ధమైన ఆదాయాలతో పోల్చి బ్యాంకు లావాదేవీలను విశ్లేషించనున్నారు. మూడు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు కూడా గుర్తించారు. వాహనాల కొనుగోలు తేదీలు, చెల్లించిన మొత్తం, రిజిస్ట్రేషన్ వివరాలను నమోదు చేశారు. కుటుంబ సభ్యుల పేర్లపై మరిన్ని ఖాతాలు, ఆస్తులు ఉన్నాయా అనే కోణంలో కూడా విచారణ సాగుతోంది.



## అతివేగంతో రహదారిపై అదుపుతప్పి, బావిలోకి దూసుకెళ్లిన కారు

**ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి -**

**విశాలభారతి, సిద్దిపేట (దుబ్బాక):** అతివేగంతో వెళుతున్న కారు రహదారి పక్కన ఉన్న బావిలోకి దూసుకెళ్లిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందిన ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్ఐ కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం దుబ్బాక మండలం బలవంతపూర్ గ్రామానికి చెందిన దండుగుల రాజు (33) ఇసుక వ్యాపారం చేస్తూ, భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో సిద్దిపేటలో ఇటీవల మృతి చెందిన బావ దశదినకర్మకు బుధవారం రాజు తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో వెళ్లారు. అనంతరం సాయంత్రము భార్య ఇద్దరు పిల్లలతో కలిసి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా అప్పనపల్లి గ్రామ శివారులో కారు అతివేగంతో అదుపుతప్పి పక్కన ఉన్న వ్యవసాయ బావిలోకి ఈ దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న రాజు, భార్య భాగ్యలక్ష్మి(25, ఇద్దరు పిల్లలు నేహాన్స్(4), శాన్విక (2) నలుగురు మృతి చెందారు. ఘటన జరిగిన చాలా సమయం తర్వాత కుటుంబ సభ్యులు, బంధువులు రాజు ప్రయాణిస్తున్న వాహనం బలవంతపూర్ కు చేరుకోలేదని గ్రహించి, రాత్రి పదిన్నరకు దుబ్బాక పోలీస్ స్టేషన్లో ఆచూకీ కోసం సంప్రదించారు. రాత్రి 11:30 కు అప్పనపల్లి శివారులో వాహనం ఉన్నట్టు సెల్ టవర్ లోకేషన్ ద్వారా గుర్తించిన పోలీసులు అక్కడకెళ్లి, పరిసరాలను పరిశీలించగా, రహదారి పక్కన బావిలో పడిన కారును గుర్తించారు. వెంటనే దుబ్బాక సీఐ రాజేష్ ఆధ్వర్యంలో ఎస్సై కీర్తి రాజు, పోలీస్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది మూడు గంటల పాటు శ్రమించి బావిలో పడిన కారును క్రేను సహాయంతో వెలికి తీశారు. కారులో లభ్యమైన నలుగురి మృతదేహాలను శవపరీక్ష నిమిత్తము దుబ్బాక వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఘటన జరిగిన విషయం తెలుసుకున్న సిద్దిపేట సిపి రశ్మి పెరుమాళ్, ఏసీపీ రవీందర్ రెడ్డి గురువారం ఉదయం దుబ్బాక 100 పడకల ఆసుపత్రిలోని మార్చురిని సందర్శించి, నలుగురి మృతదేహాలను పరిశీలించి, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం ప్రమాద ఘటన జరిగిన బావిని ఆమె పరిశీలించారు.

## ఆందోళనలో రైతన్న



**మొదటిపేజీ తరువాయి**

నీటి నష్టం అధికమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే ఎదుగుదల దశలో ఉన్న పంటలకు తేమ అవసరం ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో నీటి లభ్యత తగ్గితే మొక్కలు వాడిపోవడం, ఆకులపై ఒత్తిడి లక్షణాలు కనిపించడం, దిగుబడి సామర్థ్యం తగ్గడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు రైతులకు కొత్త సవాళ్లు విసురుతున్నాయి. జూలై రెండో అర్ధభాగంలో వర్షాలు కొంత మెరుగుపడటంతో రాష్ట్రవ్యాప్తంగా సాగు పనులు వేగం పుంజుకున్నాయి. ఫలితంగా పంటల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం వరి, పత్తి, మొక్కజొన్న, కంది తదితర పంటలు వివిధ ఎదుగుదల దశల్లో ఉన్నాయి. ఈ దశలో తగిన తేమ అందకపోతే మొలక, మొక్క ఎదుగుదల, పూత, కాయల ఏర్పాటుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. అధిక ఉష్ణోగ్రతలతో పాటు తక్కువ వర్షపాతం కొనసాగితే నేలతో పాటు పంట మొక్కల్లోనూ తేమ వేగంగా తగ్గవచ్చని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. వర్షాలు ఆలస్యమైతే రైతులు నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంటుంది. పంటల పరిస్థితిని క్రమం తప్పకుండా పరిశీలించడం అవసరమని సూచిస్తున్నారు. రానున్న రెండు వారాల్లో వర్షాలు కురవకపోతే పంటలపై ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లో తేమ లోటు తీవ్రత పెరిగితే పంటల ఎదుగుదల మందగించవచ్చు. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉండే పరిస్థితులకు ఎల్‌నినో ప్రభావం కూడా కారణమవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే వాతావరణ పరిస్థితులు జిల్లాల వారీగా మారే అవకాశం ఉండటంతో ప్రతి ప్రాంతంలో ఒకే రకమైన ప్రభావం ఉండకపోవచ్చని చెబుతున్నారు. రైతులు వాతావరణ సూచనలను గమనిస్తూ సాగునీటి వినియోగాన్ని ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచిస్తున్నారు. అవసరమైన చోట తేమను కాపాడే చర్యలు చేపట్టడం ద్వారా పంటలపై ఒత్తిడిని కొంత తగ్గించవచ్చని వ్యవసాయ శాఖ వర్గాలు భావిస్తున్నాయి. అయితే ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ అల్దాస్ జనయ్య పరిస్థితిపై ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నెల చివర్లో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితుల్లో కొంత మార్పు రావచ్చని భావిస్తున్నట్లు చెప్పారు. వర్షాలు తిరిగి సాధారణ స్థాయికి చేరితే నేలలో తేమ పెరిగి పంటలకు ఉపశమనం లభించే అవకాశం ఉంటుంది. సాగు విస్తీర్ణం పెరిగిన నేపథ్యంలో మిగిలిన సీజన్‌లో వర్షపాతం ఎలా ఉంటుందనేది కీలకంగా మారింది. వర్షాలపై ఆధారపడిన ప్రాంతాల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. వర్షం వచ్చే వరకు పంటల పరిస్థితిని పరిశీలిస్తూ అవసరమైన నీటి నిర్వహణ చర్యలు తీసుకోవడం ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతున్నారు. రాష్ట్రంలో ఆగస్టు 12 నాటికి 107.17 లక్షల ఎకరాల్లో వానాకాలం పంటల సాగు పూర్తయింది. సాగు విస్తీర్ణం పెరిగిన సమయంలో వాతావరణ పరిస్థితుల్లో అనిశ్చితి నెలకొనడం రైతులకు ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం పంటలకు కీలకమైన ఎదుగుదల దశ కొనసాగుతున్నందున వర్షపాతం లోటు, అధిక ఉష్ణోగ్రతలను నిశితంగా గమనించాల్సిన అవసరం ఉంది. రానున్న రోజుల్లో వర్షాలు సమృద్ధిగా కురిస్తే తేమ లోటు సమస్య కొంత తగ్గే అవకాశం ఉంది. లేకపోతే సాగు నీటి అవసరాలు పెరిగి రైతులపై అదనపు భారం పడవచ్చు. అందువల్ల వాతావరణ శాఖ సూచనలు, వ్యవసాయ నిపుణుల సలహాలను పాటిస్తూ రైతులు పంటల సంరక్షణపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఈ సీజన్‌లో వర్షాల తీరు పంటల దిగుబడులపై కీలక ప్రభావం చూపనుంది. రైతులు పొలాల్లో నీటి నిల్వ పరిస్థితిని పరిశీలించి, అవసరానికి అనుగుణంగా తేలికపాటి నీటిపారుదల చేపట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. వరి వంటి నీటి అవసరం ఎక్కువగా ఉన్న పంటల్లో అందుబాటులో ఉన్న వనరులను పొదుపుగా వినియోగించడం ముఖ్యం. పత్తి, కంది, మొక్కజొన్న వంటి పంటల్లో నేల తేమను నిలబెట్టేందుకు అంతర కృషి, కలుపు నియంత్రణ వంటి చర్యలు ఉపయోగపడవచ్చు. వర్షం వచ్చిన వెంటనే అధిక నీటిని పొలాల్లో నిల్వ చేయకుండా కాలువల ద్వారా బయటకు పంపే ఏర్పాట్లు కూడా అవసరం. జిల్లాల వారీగా వాతావరణ సూచనలు మారుతున్నందున రైతులు అధికారుల సలహాలు తీసుకోవడం మంచిది.

# ఉమ్మడి నల్లగొండలో గులాబీ గుబులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ ఏకైక ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి వ్యవహారశైలి గులాబీ శ్రేణుల్లో చర్చకు దారితీస్తోంది. పార్టీ అధికారంలో ఉన్న సమయంలో పదవులు, రాజకీయ ప్రయోజనాలు పొందిన ఆయన.. అధికారం కోల్పోయిన తర్వాత క్షేత్రస్థాయిలో కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధిగా పదవిలో కొనసాగుతున్నా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనకపోవడం కేడర్‌కు అసంతృప్తి కలిగిస్తోందని నేతలు చెబుతున్నారు. ఎమ్మెల్సీగా ఉన్నా పార్టీకి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం లేదన్న అభిప్రాయం పలువురు కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. గతంలో తనకు లభించిన రాజకీయ అవకాశాలకు భిన్నంగా ఇప్పుడు నిశ్శబ్దంగా ఉండటం పార్టీ శ్రేణులకు నిరాశ కలిగిస్తోందన్న చర్చ సాగుతోంది. ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనే నేతలు ప్రజల్లోకి వెళ్లి బలాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని కేడర్ భావిస్తోంది. ఈ పరిస్థితుల్లో కోటిరెడ్డి వ్యవహారశైలి బీఆర్ఎస్ భవిష్యత్ రాజకీయాలపై ప్రభావం చూపుతుందా అన్న చర్చ మొదలైంది. బీఆర్ఎస్ రెండోసారి అధికారంలో ఉన్న సమయంలో నాగార్జునసాగర్ ఉపఎన్నిక రాజకీయంగా కీలకంగా మారింది. ఆ సమయంలో అసెంబ్లీ టికెట్ ఆశించిన కోటిరెడ్డికి అవకాశం దక్కకుండా నోముల భగత్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. అనంతరం కోటిరెడ్డికి ఎమ్మెల్సీ పదవి దక్కింది. ఆ పదవిని పార్టీ విస్తరణకు ఉపయోగించాల్సిన చోట వ్యక్తిగత ప్రాబల్యం పెంచుకోవడానికే ప్రాధాన్యం ఇచ్చారన్న ఆరోపణలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌తో కోటిరెడ్డికి విభేదాలు కొనసాగిన సమయంలో నియోజకవర్గంలో వర్గ విభజన పెరిగిందని బీఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. రెండు వర్గాలుగా పార్టీ విడిపోవడం వల్ల అక్కడి కేడర్‌లో సమన్వయం దెబ్బతిందని, ఎన్నికల సమయంలో దాని ప్రభావం కనిపించిందని కొందరు నేతలు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై కోటిరెడ్డి వైపు నుంచి స్పష్టమైన వివరణ అవసరమనే అభిప్రాయం కూడా ఉంది. పార్టీ పరాజయానికి ఒక్క వ్యక్తి వ్యవహారశైలినే కారణంగా చూడలేమని మరో వర్గం చెబుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రస్తుతం విద్యుత్ కోతలు, 22ఏ నిషేధిత భూముల సమస్యలు, డిజిటల్ సర్వేలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న ఆందోళన ఉంది. ఇలాంటి సమయంలో ప్రజాప్రతినిధిగా ఉన్న ఎమ్మెల్సీ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కార్యకర్తలు కోరుతున్నారు. అధికార పక్ష నేతలు కేసీఆర్, కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిపై విమర్శలు చేస్తున్న సందర్భాల్లోనూ కోటిరెడ్డి నుంచి గట్టిగా స్పందన కనిపించడం లేదని గులాబీ శ్రేణులు అంటున్నాయి. పార్టీ చేపట్టే నిరసనలు, ధర్నాలు, ఆందోళన కార్యక్రమాల్లో ఆయన చురుగ్గా కనిపించకపోవడంపై కూడా ప్రశ్నలు వస్తున్నాయి. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై న్యాయపరమైన మార్గాలు, అధికారులతో చర్చలు, ప్రజా ఉద్యమాల ద్వారా ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని నేతలు చెబుతున్నారు. పదవి ఉన్న నాయకుడు ప్రజల మధ్య కనిపిస్తే కేడర్‌లో నమ్మకం పెరుగుతుందని, సమస్యలపై పోరాటం చేస్తే పార్టీకి రాజకీయ ప్రయోజనం కలుగుతుందని వారి అభిప్రాయం. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ మౌనం ఇప్పుడు రాజకీయ చర్చగా మారింది. పార్టీకి దూరం.. క్షేత్రస్థాయికి నై నై అనే భావన ఉమ్మడి జిల్లాలోని గులాబీ శ్రేణుల్లో బలపడుతోంది. నియోజకవర్గాల్లో పర్యటించి కార్యకర్తలను కలవడం, స్థానిక సమస్యలను తెలుసుకోవడం, పార్టీ నాయకత్వం పిలుపునిచ్చే కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి చర్యలు కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలో అప్పుడప్పుడు నిర్వహించే ప్రెస్‌మీట్లకే పరిమితమవుతున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు క్షేత్రస్థాయిలో పార్టీ ఉనికిని కాపాడేందుకు నిరంతర పర్యటనలు అవసరమని కార్యకర్తలు చెబుతున్నారు. ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో తిరుగుతూ కేడర్‌ను సమీకరిస్తున్న వేళ పదవిలో ఉన్న ఎమ్మెల్సీ మరింత చురుగ్గా వ్యవహరించాలనే డిమాండ్ పెరుగుతోంది. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం వల్ల స్థానిక నాయకత్వంలో ఉత్సాహం తగ్గే ప్రమాదం ఉందని కొందరు హెచ్చరిస్తున్నారు. నాయకుడి బలం కేవలం పదవిలో కాకుండా ప్రజల్లో ఉండటంలోనే ఉందని గులాబీ శ్రేణులు వ్యాఖ్యానిస్తున్నాయి. దీంతో కోటిరెడ్డి ఇకపై ఏ వ్యూహంతో ముందుకు సాగుతారన్నది ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయిన తర్వాత నల్లగొండ జిల్లాలో పార్టీ పునర్వ్యవస్థీకరణపై దృష్టి పెట్టాల్సిన అవసరం పెరిగింది. ఎన్నికల ఫలితాల అనంతరం కేడర్‌లో ఏర్పడిన నిరుత్సాహాన్ని తొలగించేందుకు సీనియర్ నాయకులు గ్రామాలు, మండలాలు, నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించాల్సిన పరిస్థితి ఉంది. ఈ సమయంలో ఎమ్మెల్సీ స్థాయి నాయకుడు చురుగ్గా వ్యవహరిస్తే పార్టీకి మానసిక బలం కలుగుతుందని కార్యకర్తలు భావిస్తున్నారు. అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అండగా నిలిచే రాజకీయ స్వరం జిల్లాలో బలంగా వినిపించాల్సిన అవసరం ఉందని నేతలు అంటున్నారు. ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేయడమే కాకుండా ప్రజా సమస్యలపై ప్రత్యామ్నాయ పోరాట కార్యాచరణ రూపొందించాలన్న సూచనలు వస్తున్నాయి. నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి కార్యకర్తల అభిప్రాయాలు తీసుకోవడం, రైతు సమస్యలపై కార్యాచరణ రూపొందించడం, పార్టీ కార్యక్రమాలకు హాజరుకావడం ద్వారా కోటిరెడ్డి తనపై ఉన్న విమర్శలకు సమాధానం చెప్పవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. పార్టీ కోసం పనిచేస్తున్న నేతలకు అండగా నిలవడం ద్వారా ఆయనపై ఉన్న ప్రతికూల ప్రచారాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని పరిశీలకులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఎంసీ కోటిరెడ్డి తన రాజకీయ శైలిని మార్చుకుంటారా, లేక ప్రస్తుత మౌనాన్నే కొనసాగిస్తారా అన్నది ఉమ్మడి నల్లగొండ రాజకీయాల్లో కీలక ప్రశ్నగా మారింది. ఎమ్మెల్సీ పదవి ప్రజల సమస్యలపై స్పందించేందుకు ఉపయోగపడితేనే దాని రాజకీయ విలువ పెరుగుతుందని కేడర్ అభిప్రాయపడుతోంది. విద్యుత్ కోతలు, భూముల సమస్యలు, రైతుల ఇబ్బందులు వంటి అంశాలపై ప్రత్యక్షంగా ప్రజల మధ్యకు వెళ్లి పోరాడితే పార్టీకి కొత్త ఊపిరి వస్తుందని కార్యకర్తలు ఆశిస్తున్నారు. మరోవైపు వ్యక్తిగత విభేదాల ఆరోపణలను పక్కనపెట్టి పార్టీ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు. నాయకత్వంపై విమర్శలు వచ్చినా సమాధానం చెప్పడం, కార్యకర్తలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం, నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించడం ద్వారా తన రాజకీయ ప్రస్థానంపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని నేతలు చెబుతున్నారు. కష్టకాలంలో కనిపించే నాయకుడికే కేడర్‌లో విశ్వాసం ఏర్పడుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అందుకే కోటిరెడ్డి ఇకపై ప్రజాక్షేత్రంలోకి ఎంతవరకు వస్తారన్నదే బీఆర్ఎస్ శ్రేణుల్లో చర్చగా మారింది. ఆయన చర్యలే ఈ విమర్శలకు భవిష్యత్తులో సమాధానం ఇవ్వనున్నాయి.



# ఉచిత వైద్యానికి 'ప్రైవేట్' బ్రేక్!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**


గజ్వేల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత వైద్యం కోసం వచ్చే నిరుపేదలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆసుపత్రిలో అవసరమైన వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నప్పటికీ కొందరు సిబ్బంది రోగులను ప్రైవేట్ ల్యాబ్‌లకు పంపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రి సేవలపై ఆధారపడిన పేద కుటుంబాలు పరీక్షల పేరుతో అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని బాధితులు చెబుతున్నారు. వైద్య సేవలు ఉచితంగా అందాల్సిన చోట ప్రైవేట్ కేంద్రాల వైపు దారి మళ్లించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ పెంచాలని స్థానికులు కోరుతున్నారు. గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో వంద పడకల జనరల్ ఆసుపత్రితో పాటు మరో వంద పడకల మాతా శిశు సంరక్షణ కేంద్రం ఉంది. గర్భిణులు, బాలింతలు, సాధారణ రోగులు, క్యాన్సర్ బాధితులు, పక్షవాతం రోగులు, శస్త్రచికిత్స అవసరమైన వారికి వివిధ సేవలు అందుతున్నాయి. ఆసుపత్రిలో ల్యాబ్ సదుపాయాలు, వైద్య పరికరాలు ఉన్నప్పటికీ కొన్ని పరీక్షలకు బయటకు పంపుతున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా అల్ట్రాసౌండ్, టీఫా, గ్రోత్ స్కానింగ్, ఎక్స్‌రే, ఈసీజీ వంటి పరీక్షల కోసం ప్రైవేట్ డయాగ్నొస్టిక్ కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోందని చెబుతున్నారు. అత్యవసర సమయంలో ఈ ఖర్చులు పేదలకు భారంగా మారుతున్నాయి. ప్రైవేట్ ల్యాబ్‌లకు చెందిన ఏజెంట్లు ఆసుపత్రి పరిసరాల్లో తిరుగుతూ రోగులను తమ కేంద్రాలకు తీసుకెళ్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు సిబ్బందితో కుమ్మక్కై కమీషన్ల కోసం పరీక్షలు బయట చేయిస్తున్నారని స్థానికులు అంటున్నారు. డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధుల నిర్ధారణకు అవసరమైన కిట్లు అందుబాటులో లేకపోవడంతో కొన్ని సందర్భాల్లో రోగులు ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారని సమాచారం. స్కానింగ్ అత్యవసరంగా అవసరమైనప్పుడు బయటకు వెళ్లక తప్పని పరిస్థితి నెలకొంటోంది. ఒక్కో కుటుంబం పరీక్షల కోసం వందల నుంచి వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరకు మార్చురీ వద్ద కూడా వసూళ్ల ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల



మెదక్ ఎంపీ రఘునందన్ రావు గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి నిర్వహణ, డెవలప్‌మెంట్ ఫండ్స్ వినియోగం, సిబ్బంది పనితీరుపై ఆయన ప్రశ్నలు సంధించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రైవేట్ ఆసుపత్రుల ఏజెంట్లు ఎందుకు తిరుగుతున్నారనే అంశంపై ఎంపీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. రోగులకు అందుతున్న సేవలను పరిశీలించి లోపాలపై అధికారులను నిలదీశారు. ఈ తనిఖీతో ఆసుపత్రి నిర్వహణపై మరోసారి చర్చ మొదలైంది. ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాల్సిన అవసరం ఉందని ప్రజలు చెబుతున్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాంతం. మాజీ సీఎం, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ ఇక్కడి నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అలాంటి ప్రాంతంలోని ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రైవేట్ ల్యాబ్‌లకు రోగులను పంపుతున్నారన్న ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఆసుపత్రిలో ఉన్న సదుపాయాలను ప్రజలకు ఉపయోగపడేలా చేయడంతో పాటు సిబ్బంది పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు. రాజకీయ ప్రాధాన్యత ఉన్న ప్రాంతం కావడంతో ఈ ఆరోపణలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ పెరుగుతోంది. ఆసుపత్రిలోని కొన్ని విభాగాల్లో ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న సిబ్బందిపై కూడా ఆరోపణలు వస్తున్నాయి. బదిలీ నిబంధనలు ఉన్నప్పటికీ కొందరు ఇక్కడే కొనసాగుతున్నారని, స్థానిక ప్రైవేట్ డయాగ్నొస్టిక్ కేంద్రాలతో సంబంధాలు పెంచుకున్నారని విమర్శలు ఉన్నాయి. సిబ్బంది కొరత, వైద్యుల కొరత మరో సమస్యగా మారింది. ఉన్న వైద్యుల్లో కొందరు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదన్న ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. ఆసుపత్రి ఆవరణలో డాక్టర్లు, స్టాఫ్ నివాసం కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి 20 ఇళ్లను నిర్మించింది. అయితే వాటిలో ఒక్కరు కూడా నివసించడం లేదని, భవనాలు నిరుపయోగంగా మారాయని స్థానికులు చెబుతున్నారు. ఈ వసతులను వినియోగంలోకి తెస్తే వైద్యుల అందుబాటు మెరుగుపడే అవకాశం ఉంది. గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు అందాల్సిన వైద్యం, పరీక్షలు, సిబ్బంది సహకారం విషయంలో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ప్రతి పరీక్షను ఉచితంగా లేదా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందించేలా తక్షణం చర్యలు చేపట్టాలి. ప్రైవేట్ ల్యాబ్ ఏజెంట్ల రాకపోకలను నియంత్రించాలి. రోగులను బయటకు పంపే ప్రతి పరీక్షకు కారణాన్ని నమోదు చేసే విధానం తీసుకురావాలి. సీసీ కెమెరాల పర్యవేక్షణ పెంచడంతో పాటు ఫిర్యాదుల కోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలి. ఉన్నతాధికారులు తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తే సేవల నాణ్యత పెరిగే అవకాశం ఉంది. పేదలు అప్పులు చేసి వైద్యం చేయించుకునే పరిస్థితి లేకుండా ప్రభుత్వ ఆసుపత్రిని ప్రజలకు నిజమైన భరోసాగా మార్చాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. రోగులకు సమాచారం ఇవ్వకుండా పరీక్షలకు బయటకు పంపడం వల్ల ప్రభుత్వ వైద్య వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటోంది. ఏ పరీక్ష ఆసుపత్రిలో అందుబాటులో ఉంది, ఏది బయట చేయాల్సి ఉంటుంది అనే వివరాలను రోగుల సహాయ కేంద్రంలో స్పష్టంగా ప్రదర్శించాలి. ఉచిత పరీక్షలకు సంబంధించిన జాబితాను వార్డులు, ఓపీ విభాగాల్లో అందుబాటులో ఉంచాలి. రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులను స్వీకరించేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్ ఏర్పాటు చేయాలి. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచాలి. వైద్యులు రాసే పరీక్షలపై పర్యవేక్షణ ఉండాలి. ప్రైవేట్ కేంద్రానికి పంపిన ప్రతి కేసును రికార్డులో నమోదు చేయాలి. ఇలా చేస్తే అనవసర పరీక్షలు తగ్గే అవకాశం ఉంటుంది. ఆసుపత్రి సూపరింటెండెంట్ బాధ్యతలను క్రమం తప్పకుండా సమీక్షించాలి. వైద్య సిబ్బంది హాజరు, ల్యాబ్ పరికరాల పనితీరు, మందుల నిల్వ, అత్యవసర సేవలను అధికారులు పరిశీలించాలి. ప్రజలకు నాణ్యమైన సేవలు అందితే ప్రైవేట్ ఖర్చులు తగ్గుతాయి. ప్రభుత్వ నిధులతో ఏర్పాటైన సదుపాయాలు పూర్తిస్థాయిలో వినియోగంలోకి వస్తే గజ్వేల్ ఆసుపత్రిపై పేదలకు విశ్వాసం పెరుగుతుంది. ఆరోపణలు, ఫిర్యాదులు నిర్ధారణ కాకముందే ఎవరినీ దోషిగా తేల్చకుండా, నిష్పక్షపాత విచారణతో నిజానిజాలు తేల్చడం కూడా కీలకం. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు వ్యవస్థలో లోపాలు పునరావృతం కాకుండా శాశ్వత మార్పులు తీసుకురావాలి. పేద రోగుల హక్కులను కాపాడేలా పారదర్శక విధానం అమలు చేయడం తక్షణ అవసరంగా కనిపిస్తోంది. అధికారుల చర్యలు కాగితాలకే పరిమితం కాకుండా, రోజువారీ సేవల్లో కనిపించినప్పుడే ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో మళ్లీ నమ్మకం బలపడుతుంది. అది ప్రజలకు నేరుగా ఉపశమనం కలిగిస్తుంది.

## కాంగ్రెస్‌కి కష్టకాలం మొదలైందా?

**మొదటిపేజీ తరువాయి**



ధ్రువపత్రాల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. తాజాగా బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థులతో సంతకాల సేకరణ చేపట్టి ఉద్యమిస్తామని, అవసరమైతే తాను నిరాహార దీక్షకు దిగుతానని ప్రకటించడంతో అంశం మరోసారి రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. విద్యార్థుల సమస్య కేవలం ఫీజులకే పరిమితం కాకుండా కళాశాలల నిర్వహణపై కూడా ప్రభావం చూపుతోంది. బకాయిలు ఆలస్యం కావడంతో యాజమాన్యాలు ఒత్తిడి పెంచుతున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. ప్రభుత్వ నిధుల విడుదలపై స్పష్టమైన తేదీలు ప్రకటించాలని వారు కోరుతున్నారు. మాటలకంటే కార్యాచరణ కావాలని విద్యార్థి సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలు కూడా ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచుతున్నాయి. పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించి ఫిట్‌మెంట్ ప్రకటించాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలన్న అంశం కూడా చాలాకాలంగా వివాదంగా ఉంది. ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో వచ్చే నెల 10న హైదరాబాద్‌లో మహాధర్నాకు పిలుపునివ్వడం, సెప్టెంబర్ 1న పెన్షన్ ద్రోహ దినంగా పాటించాలని నిర్ణయించడం ప్రభుత్వానికి కొత్త సవాల్‌గా మారింది. హామీల అమలులో జాప్యం కొనసాగితే నిరసనలు మరింత ఉధృతమయ్యే అవకాశం ఉంది. ఉద్యోగుల డిమాండ్లలో జీతభత్యాలు కీలకంగా మారాయి. పీఆర్సీ ప్రక్రియ ఆలస్యం కావడం వల్ల వేతన సవరణపై అనిశ్చితి కొనసాగుతోంది. డీఏ బకాయిల విడుదలకు షెడ్యూల్ ప్రకటించాలని సంఘాలు కోరుతున్నాయి. పెన్షనర్లకు కూడా ఆర్థిక భారం పెరుగుతోందని నాయకులు చెబుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుంటే సమ్మె వాతావరణాన్ని నివారించవచ్చు. సింగరేణి కార్మికుల సమస్యలు కూడా ప్రభుత్వానికి తలనొప్పిగా మారాయి. వారసత్వ ఉద్యోగాల కోసం కార్మికులు తాజాగా మూడు రోజులపాటు నిరాహార దీక్ష చేపట్టారు. ఉద్యోగ భద్రత, కుటుంబాల భవిష్యత్తుకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు. మరోవైపు ధరణికి ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతిపై విమర్శలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా 22ఏ నిషేధిత భూముల జాబితా అంశం సామాన్యుల్లో చర్చకు దారితీసింది. భూములను నిషేధిత జాబితాలో చేర్చి, తర్వాత వాటి పరిష్కారానికి కమిషన్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలను ప్రతిపక్షాలు చేస్తున్నాయి. అయితే ప్రభుత్వం ఈ ఆరోపణలను ఖండిస్తూ, భూ సమస్యల పరిష్కారానికి భూభారతి తీసుకొచ్చామని చెబుతోంది. సింగరేణి ప్రాంతాల్లో వారసత్వ ఉద్యోగాల అంశానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించే విధానంపై కార్మికులు చాలాకాలంగా ఆశలు పెట్టుకున్నారు. నిరాహార దీక్షతో సమస్య మళ్లీ ముందుకు రావడంతో ప్రభుత్వం కార్మిక ప్రతినిధులతో చర్చించాల్సిన అవసరం కనిపిస్తోంది. భూభారతి అమలులో సాంకేతిక సమస్యలు, రికార్డుల మార్పులు, నిషేధిత జాబితాపై అభ్యంతరాలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయన్న ఫిర్యాదులు ఉన్నాయి. భూమి యజమానులకు తమ ఆస్తి స్థితి స్పష్టంగా తెలిసే 22ఏ భూముల వివరాలను ఆన్‌లైన్‌లో ఎందుకు అందుబాటులో ఉంచలేదని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించిన అంశం కూడా రాజకీయంగా చర్చనీయాంశమైంది. రేవంత్ రెడ్డి నివాసం కూడా ఈ జాబితాలో ఉన్నట్లు సమాచారం వెలుగులోకి వచ్చిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులకు నిబంధనలకు విరుద్ధంగా వేల కోట్ల విలువైన టెండర్లు, కాంట్రాక్టులు కట్టబెడుతున్నారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

## తెలుగులో లెటర్ రాయడం వచ్చా రేవంత్?



**మొదటిపేజీ తరువాయి**

వస్తే తమ కోర్సుల గుర్తింపు, బోధనా విధానం, ప్రవేశ ప్రక్రియ, ఉద్యోగ అవకాశాలపై ప్రభావం పడుతుందనే ఆందోళనను విద్యార్థులు వ్యక్తం చేశారు. తమతో సంప్రదింపులు జరపకుండానే నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. 'శక్తి స్కీమ్' పేరు వినగానే తమకు తలనొప్పి వస్తోందని ఓ విద్యార్థిని వ్యాఖ్యానించింది. తమకు లెటర్ రాయడం రాదని విమర్శలు చేస్తున్నారని, అయితే ఇంజినీరింగ్ విద్యార్థులుగా తాము ఎన్నో సాంకేతిక అంశాలు నేర్చుకుంటున్నామని చెప్పింది. సీఎం రేవంత్‌రెడ్డికి ఇంగ్లిష్ రాదని చెబుతున్నారని, కనీసం తెలుగులోనైనా రాయగలరా అని ప్రశ్నించింది. విద్యార్థులకు చదువు రాదని చెప్పే హక్కు ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని నిలదీసింది. విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు సీఎం స్వయంగా వచ్చి చూడాలని కోరింది. ఇంజినీరింగ్ విద్యలో లేఖలు రాయడం ఒక్కటే ప్రమాణం కాదని, ప్రయోగశాలల్లో పని చేయడం, సాంకేతిక సమస్యలను పరిష్కరించడం, యంత్రాలను అర్థం చేసుకోవడం కూడా విద్యలో భాగమేనని ఆమె పేర్కొంది. పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రాథమిక అవసరాలను తీర్చకుండా కొత్త పథకాలు తీసుకురావడం వల్ల ప్రయోజనం ఏమిటని మరో విద్యార్థిని ప్రశ్నించింది. డిప్లొమా చదివే విద్యార్థులు ఇప్పటికే సాంకేతిక విద్యలో పునాది నైపుణ్యాలు పొందుతున్నారని వివరించింది. తర్వాత బీటెక్‌లో మరింత పరిజ్ఞానం సంపాదించేందుకు అవకాశం ఉంటుందని తెలిపింది. ఐటీ విద్యార్థుల మాదిరిగా మళ్లీ మొదటి నుంచి చదవాల్సిన పరిస్థితి వస్తే తమకు ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పింది. విద్యార్థుల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమైతే ముందుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని కోరింది. ఇప్పటివరకు ఒక్కరికి కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందలేదని ఆవేదన వ్యక్తం చేసింది. డిప్లొమా విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచే చర్యలు తీసుకుంటే స్వాగతిస్తామని, అయితే ప్రస్తుతం ఉన్న కోర్సులను బలహీనపరిచే మార్పులను అంగీకరించబోమని స్పష్టం చేసింది. స్కాలర్‌షిప్‌ల విషయంలోనూ విద్యార్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాలేజీ ఫీజును ముందుగా తామే చెల్లించాల్సి వస్తోందని, స్కాలర్‌షిప్ వచ్చిన తర్వాత డబ్బులు తిరిగి ఇస్తామని అధికారులు చెబుతున్నారని తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాల విద్యార్థులకు ఇది అదనపు భారంగా మారుతోందన్నారు. డిప్లొమా పూర్తి చేసిన వారికి ఉన్నత విద్యలో ప్రవేశ అవకాశాలు స్పష్టంగా ఉండాలని కోరారు. ప్రస్తుత మార్పుల వల్ల ప్రభుత్వ ఉద్యోగాల అవకాశాలు తగ్గిపోతాయనే భయం ఉందని కొందరు విద్యార్థులు తెలిపారు. భవిష్యత్‌పై స్పష్టత లేకుండా నిర్ణయాలు తీసుకోవద్దని ప్రభుత్వాన్ని కోరారు. ఫీజులు చెల్లించలేక కొందరు విద్యార్థులు చదువు మధ్యలోనే ఆపే పరిస్థితి వస్తోందని తెలిపారు. బకాయిలు వెంటనే విడుదలైతే కుటుంబాలపై ఆర్థిక ఒత్తిడి తగ్గుతుందని చెప్పారు. నిరసన సందర్భంగా పోలీసుల వ్యవహారశైలిపై విద్యార్థులు తీవ్ర ఆరోపణలు చేశారు. జీవో రద్దు చేయాలని శాంతియుతంగా ఆందోళన చేస్తుండగా పోలీసులు వచ్చి తమపై దాడి చేశారని పలువురు విద్యార్థులు ఆరోపించారు. అమ్మాయిలను సైతం ఇష్టానుసారం కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన సమయంలో అక్కడ మహిళా కానిస్టేబుల్ కూడా లేరని తెలిపారు. తమపై దాడి చేసిన పోలీసు అధికారిగా వీ. అశోక్‌రెడ్డి పేరును ప్రస్తావిస్తూ, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన జరిగిందని చెప్పారు. తమ నిరసనకు సమాధానం లాఠీచార్జి కాదని, చర్చల ద్వారా పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై బలప్రయోగం జరిగిందన్న ఆరోపణలపై ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాలని కోరారు. నిరసన తెలిపే హక్కును గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థి సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ప్రశ్నలు సంధించాడు. తమకు చదవడం రాదని, ఇంగ్లిష్ మాట్లాడటం రాదని విమర్శలు చేయడం సరికాదని అన్నాడు. చిన్న తరగతుల్లో చదివే విద్యార్థులు కూడా ఇంగ్లిష్ మాట్లాడుతున్నారని పేర్కొంటూ, తమపై అలాంటి వ్యాఖ్యలు చేయడం అవమానకరమని ఆగ్రహం వ్యక్తం చేశాడు. తమ కుటుంబాలు కష్టపడి చదివిస్తున్న విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించే ముందు ప్రభుత్వం తమ అభిప్రాయాలను వినాలని కోరాడు. విద్యార్థులను తక్కువ చేసి మాట్లాడకుండా వారి సమస్యలను అర్థం చేసుకోవాలని సూచించాడు. ప్రభుత్వం విద్యార్థుల మాట వినకుండా నిర్ణయాలను కొనసాగిస్తే పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతుందని హెచ్చరించాడు. తమ డిమాండ్లపై అధికారికంగా స్పందించాలని కోరాడు. జీవో 97ను తక్షణమే రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యను పాత విధానంలో కొనసాగించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. సాంకేతిక విద్యకు సంబంధించిన నిర్ణయాలు విద్యార్థులు, అధ్యాపకులు, నిపుణులతో చర్చించిన తర్వాత తీసుకోవాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై కేసులు పెట్టకుండా, పోలీసుల దాడిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తమ విద్యా భవిష్యత్‌ను ప్రయోగాలకు గురిచేయొద్దని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జీవో రద్దు జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని విద్యార్థులు తేల్చిచెప్పారు. రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కాలేజీల విద్యార్థులను కలుపుకొని ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు. విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా కల్పించే నిర్ణయం ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం తక్షణం సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల సందేహాలకు సమాధానాలు ఇవ్వాలని వారు కోరారు.

### బాలికను వేధించిన నిందితుడికి మూడేళ్ల జైలు రూ20 వేల జరిమానా

- తూప్రాన్ సర్కిల్ శివ్వంపేటలో ఘటన
- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

**విశాలభారతి, తూప్రాన్;** బాలికను వేధిస్తూ, అసభ్యకరమైన ఫొటోలు పంపాలని కోరడంతోపాటు బెదిరింపులకు పాల్పడిన కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ మెదక్ జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు తీర్పు వెలువరించింది. ఈ విషయాన్ని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. దాసరి స్వామి (26) అనే వ్యక్తి తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక ఫోన్ నంబర్‌ను ఆమె స్నేహితుల ద్వారా తీసుకుని తరచూ ఫోన్ చేస్తూ వేధించేవాడు. పాఠశాల వద్దకు వస్తానని, తనను కలవాలని ఒత్తిడి చేసేవాడు. బాలిక అతడిని కలవకుండా ఇంటికి వెళ్లడంతో "నువ్వు రాకపోతే పెట్రోల్ పోసుకుని చచ్చిపోతా" అంటూ బెదిరించాడు. విషయం తల్లిదండ్రులకు తెలియడంతో ఇకపై బాలిక జోలికి రానని నిందితుడు రాతపూర్వకంగా హామీ ఇచ్చాడు. అయితే రెండేళ్ల అనంతరం వేసవి సెలవుల్లో మళ్లీ బాలికకు తన స్నేహితురాలిగా వాట్సాప్‌లో రెండు రోజులపాటు సందేశాలు పంపించాడు. అనంతరం ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్యకరమైన, నగ్న చిత్రాలు పంపాలని కోరుతూ బాలికను వేధించాడు. 2024 మే 24న బాలిక తండ్రికి ఫోన్ చేసి తన కుమార్తెను ఇంటికి పంపాలని, లేదంటే ఆమె మేజర్ అయిన తర్వాత లేపుకుపోతానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శివంపేట పోలీసులు అప్పటి ఎస్ఐ మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నిందితుడికి వ్యతిరేకంగా అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో సమర్పించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య బలమైన వాదనలు వినిపించారు. పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన మెదక్ జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితుడు దాసరి స్వామికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కేసు దర్యాప్తు, కోర్టు వ్యవహారాల్లో కోర్టు లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కృష్ణగౌడ్, సీడీఓ ఆనంద్ సహకరించారు.

## హరీశ్ వర్సెస్ పొంగులేటి

**మొదటిపేజీ తరువాయి**



జరిగిన వ్యవహారాలను ప్రశ్నిస్తూ రాజకీయ దాడిని మరింత ఉధృతం చేసింది. హరీశ్ రావు తనను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేసిన నేపథ్యంలో పొంగులేటి ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పదేపదే అబద్ధాలు చెబుతూ ప్రజల్లో ఆందోళన రేకెత్తించడం తప్ప ఆ పార్టీ వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని విమర్శించారు. నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన బీఆర్ఎస్ ప్రతి అంశాన్ని రాజకీయ వివాదంగా మార్చే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. 22ఏ భూముల విషయంలో వాస్తవాలను ప్రజలకు వివరించాల్సింది పోయి ఆరోపణలతో గందరగోళం సృష్టిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ నిర్ణయాలపై ప్రశ్నలు అడగడం ప్రతిపక్ష హక్కే అయినా, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే చర్యగా ఆయన అభివర్ణించారు. కమీషన్లు, అవినీతి గురించి హరీశ్ రావు మాట్లాడుతుంటే బీఆర్ఎస్ నేతలే నవ్వుకుంటున్నారని పొంగులేటి ఎద్దేవా చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చోటుచేసుకున్న అవినీతిపై ఆ పార్టీకి చెందిన నాయకులు గతంలో చేసిన వ్యాఖ్యలను హరీశ్ రావు గుర్తు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత గతంలో చేసిన విమర్శలను ప్రస్తావిస్తూ, వాటిని ఇప్పుడు ఎలా మరిచిపోయారని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న సమయంలో తీసుకున్న నిర్ణయాలు, ఆ నిర్ణయాల వెనుక ఉన్న ఆర్థిక వ్యవహారాలపై బీఆర్ఎస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల ముందుకు వచ్చి పారదర్శకంగా వివరణ ఇవ్వకుండా ప్రత్యర్థులపై ఆరోపణలు చేయడం సరైన రాజకీయ విధానం కాదని మంత్రి పేర్కొన్నారు. హరీశ్ రావు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలా సంపాదించారో, ఏ వ్యాపారం చేశారో ప్రజలకు వివరించాలని పొంగులేటి ప్రశ్నించారు. తక్కువ సమయంలో భారీగా ఆర్థికంగా ఎదగడానికి కారణమేంటో వెల్లడించాలన్నారు. వ్యక్తిగత ఆస్తులు, వ్యాపార లావాదేవీలపై నేరుగా ఆరోపణలు చేయడం ద్వారా రాజకీయ వేడి మరింత పెరిగింది. అయితే ఈ ఆరోపణలకు హరీశ్ రావు నుంచి స్పష్టమైన సమాధానం రావాల్సి ఉంది. మరోవైపు 22ఏ జాబితాలో ఉన్న భూములపై ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు, రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడం, హక్కుల విషయంలో ఏర్పడుతున్న అనిశ్చితి వంటి సమస్యలపై ప్రభుత్వం సమగ్రంగా స్పందించాల్సిన అవసరం కనిపిస్తోంది. భూముల వివాదాన్ని వ్యక్తిగత రాజకీయ విమర్శలకు పరిమితం చేయకుండా బాధితులకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, ధరణి పోర్టల్, మెడికల్ కాలేజీల వరకు బీఆర్ఎస్ హయాంలో భారీ అవినీతి జరిగిందని పొంగులేటి ఆరోపించారు. తమ పాలనలో కమీషన్ల ఆధారంగా పనులు జరిగాయని, అదే విధానం కాంగ్రెస్ ప్రభుత్వంలో కొనసాగుతుందని బీఆర్ఎస్ భావించడం భ్రమేనని అన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాలపై విచారణలు, నివేదికలు, న్యాయపరమైన ప్రక్రియల ద్వారా వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉందని ఆయన వ్యాఖ్యల సారాంశం. ఆధారాలతో కూడిన ఆరోపణలకు ప్రభుత్వం సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఉందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో ప్రతిపక్షం కూడా ప్రతి ఆరోపణకు ఆధారాలు చూపాల్సిన అవసరం ఉంది. లేకపోతే ప్రజా సమస్యగా ప్రారంభమైన 22ఏ అంశం మరో రాజకీయ ఆరోపణల యుద్ధంగా మారే అవకాశం ఉంది. మీ భ్రమను ప్రజలపై రుద్దకండి అంటూ హరీశ్ రావు, బీఆర్ఎస్ నేతలకు పొంగులేటి హితవు పలికారు. గతంలో అధికారంలో ఉండి పరిపాలనలో విఫలమైన బీఆర్ఎస్ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ నిర్మాణాత్మకంగా వ్యవహరించడం లేదని విమర్శించారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను సమర్థించుకోవడం కంటే ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించడమే ముఖ్యమని అన్నారు. 22ఏ జాబితాలో ఏ భూములు ఉన్నాయి, వాటిని ఎందుకు నిషేధిత జాబితాలో చేర్చారు, వాటిలో తప్పుగా నమోదైన భూములు ఎన్ని అనే వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ వినిపిస్తోంది. జిల్లా స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, నిజమైన భూస్వాములకు త్వరితగతిన పరిష్కారం చూపితే వివాదం తగ్గే అవకాశం ఉంది. ఈ అంశంలో రాజకీయ ఆరోపణల కంటే పరిపాలనా చర్యలు కీలకంగా మారనున్నాయి. తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల అంశం ఇప్పుడు కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మరో పెద్ద రాజకీయ పోరుగా మారింది. ప్రైవేటు భూములను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల రైతులు, భూస్వాములు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రతిపక్షం ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రభుత్వం మాత్రం గత పాలనలోని భూ వ్యవహారాలను ప్రస్తావిస్తూ తనపై వచ్చిన ఆరోపణలను తిప్పికొడుతోంది. పొంగులేటి వ్యాఖ్యలు ఈ వివాదాన్ని మరింత వేడెక్కించగా, హరీశ్ రావు తదుపరి స్పందనపై ఆసక్తి నెలకొంది. ఆరోపణలు, ప్రత్యారోపణల మధ్య అసలు సమస్య అయిన భూముల రికార్డుల పరిశీలన, తప్పుల సవరణ, బాధితులకు న్యాయం వంటి అంశాలు వెనుకబడకూడదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం సమగ్ర నివేదికను ప్రజల ముందు ఉంచితే అనుమానాలకు తెరపడే అవకాశం ఉంది. ప్రతిపక్షం ఆధారాలతో ప్రశ్నిస్తే చర్చ కూడా వాస్తవాల దిశగా సాగుతుంది. ప్రస్తుతం మాత్రం 22ఏ భూముల వివాదం తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి కేంద్రబిందువుగా మారింది. భూముల రికార్డుల డిజిటలైజేషన్, పాత పత్రాల పరిశీలన, రెవెన్యూ అధికారుల బాధ్యతలపై కూడా ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలి. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, నిర్ణీత గడువులో పరిష్కరించే వ్యవస్థ ఏర్పాటైతే వివాదానికి శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉంటుంది. రాజకీయ విమర్శలకు అతీతంగా ప్రజా ప్రయోజనమే ప్రాధాన్యంగా ఉండాలి. ఇదే సమయంలో అన్ని పార్టీల నేతలు బాధ్యతగా వ్యవహరించాలి అవసరం. ఈ సమస్యపై శాసనసభలో సమగ్ర చర్చ జరిగి, భూ రికార్డులపై ప్రభుత్వం, ప్రతిపక్షం ఒకే సమాచారాన్ని ప్రజలకు అందిస్తే అనవసర అపోహలు తగ్గుతాయి. రైతులు, మధ్యతరగతి కుటుంబాలు, చిన్న భూస్వాములు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుంది. ఈ దిశగా రెవెన్యూ శాఖ వేగంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అదే ప్రజల ప్రధాన ఆకాంక్ష.

## మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం - ఎస్.జె.కె.అహ్మద్

**పాల్వంచ విశాల భారతి:**

దేశాభివృద్ధికి మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎస్.జె.కె.అహ్మద్ అన్నారు. గురువారం భారత మాజీ ప్రధాని, భారత రత్న రాజీవ్‌గాంధీ 82వ జయంతిని పురస్కరించుకొని పాల్వంచ పట్టణంలోని రాజీవ్‌గాంధీ మార్కెట్ ఏరియాలో గల రాజీవ్‌గాంధీ విగ్రహానికి ఎస్.జె.కె. అహ్మద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ దేశాభివృద్ధికి, ఆధునిక భారత నిర్మాణానికి విశేష కృషి చేశారని, ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు. భారతదేశంలో సాంకేతిక, సమాచార విప్లవానికి నాంది పలికిన దూరదృష్టిగల నాయకుడు రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గద్దర్ భాష, భూక్య శంకర్ (ఫారెస్ట్ శంకరన్న), మస్నా శ్రీనివాస్, ఎస్.ఏ. నయీమ్, మజీద్ ఖురేషి, సయ్యద్ అక్బర్, షేక్ వసీం, తదితరులు పాల్గొన్నారు.



# నాకేం సంబంధం లేదు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి తన లిఖితపూర్వక వివరణను సమర్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిలపై తన కుమార్తె కొండా సుస్మితా పటేల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వ్యవహారంలో ఈ చర్య తీసుకున్నారు. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ డాక్టర్ మల్లు రవికి అధికారిక లెటర్ హెడ్‌పై పంపిన లేఖలో కీలక విషయాలను వెల్లడించారు. కుమార్తె చేసిన వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కుటుంబ బంధాన్ని ఆసరాగా చేసుకుని తనపై రాజకీయ నెపం మోపడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని తేల్చిచెప్పారు. ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చను రేకెత్తించింది. మంత్రి సురేఖ తన వైఖరిని స్పష్టం చేయడం ద్వారా పార్టీ అంతర్గత వ్యవహారాల్లో కొత్త దశను సృష్టించారు. లేఖలో పేర్కొన్న అంశాలు అన్నీ అధికారికంగా నమోదు చేయబడ్డాయి. కమిటీ వైపు నుంచి తదుపరి చర్యలు ఎలా ఉంటాయో అందరూ ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ అంశం గురించి వివిధ వర్గాలు ప్రతిస్పందిస్తున్నాయి. మంత్రి లేఖలో ఉన్న వివరాలు మరింత స్పష్టతను అందించాయి. ఆగస్టు 19న తన జన్మదిన వేడుకల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కొండా కుటుంబ అభిమానులు కాంగ్రెస్ కార్యకర్తలు పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారని సురేఖ పేర్కొన్నారు. ఇందులో భాగంగా తన స్వస్థలమైన గీసుకొండతో ఉన్న ప్రత్యేక అనుబంధంతో అక్కడి అభిమానులు నిర్వహించిన వేడుకల్లో తన కుమార్తె సుస్మిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారని తెలిపారు. ఆ కార్యక్రమంలో సుస్మిత చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలేనని వాటితో పార్టీ పరంగా తనకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. జన్మదిన సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమాలు సామాజిక సేవా దృక్పథంతో నిర్వహించబడ్డాయి. అభిమానులు స్వచ్ఛందంగా పాల్గొని వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. గీసుకొండలోని వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



కుమార్తె అక్కడ ప్రసంగించిన విషయాలు ఆమె స్వంత అభిప్రాయాలకు పరిమితమైనవని మంత్రి నొక్కి చెప్పారు. ఈ వివరాలన్నీ లేఖలో వివరంగా పొందుపరచబడ్డాయి. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ సారూప్య కార్యక్రమాలు జరిగాయి. అభిమానుల సంఖ్య ఎక్కువగా ఉండడం వల్ల వేడుకలు విస్తృతంగా జరిగాయి. సురేఖ ఈ అంశాలను కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. కుటుంబ బంధం రీత్యా ఒకరు వ్యక్తం చేసిన వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరిని బాధ్యులను చేస్తూ వివరణ కోరడం తగదని మంత్రి సురేఖ అభ్యంతరం వ్యక్తం చేశారు. కుమార్తె మాట్లాడిన మాటలకు తనను బాధ్యురాలిని చేయడం సహజ న్యాయ సూత్రాలకు పూర్తి విరుద్ధమని ఆమె గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని స్పష్టం చేస్తూ ప్రజాస్వామ్య విలువలు వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని ఈ వ్యవహారంలో తనకు ఇచ్చిన నోటీసును తక్షణమే ఉపసంహరించుకోవాలని క్రమశిక్షణ కమిటీని కోరారు. ఈ వాదనలు లేఖలో స్పష్టంగా పేర్కొనబడ్డాయి. సహజ న్యాయ సూత్రాలను ఉల్లంఘించడం తగదని ఆమె నొక్కి చెప్పారు. పార్టీ నియమావళిని గౌరవిస్తూ తన వైఖరిని వెలిబుచ్చారు. ప్రజాస్వామ్య విలువలు ప్రాధాన్యం కలిగి ఉండాలని సూచించారు. నోటీసు ఉపసంహరణ కోసం స్పష్టమైన అభ్యర్థన చేశారు. లేఖలోని భాషా శైలి అధికారికంగా ఉంది. మంత్రి తన వాదనలను బలపరచడానికి అనేక అంశాలను ఉదహరించారు. కమిటీ ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని ఆశిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపై కొండా సుస్మిత బాహాటంగా విమర్శలు గుప్పించడంతో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ మంత్రి సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే కూతురి రాజకీయ వ్యాఖ్యల నుంచి తాను పరోక్షంగా దూరంగా జరుగుతూనే నోటీసుల ఉపసంహరణ కోరుతూ సురేఖ లేఖ రాయడం కాంగ్రెస్ పార్టీలో మరింత ఆసక్తికర చర్చకు దారితీసింది. ఈ నోటీసు జారీ అయిన తర్వాత రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చలు తీవ్రమయ్యాయి. సురేఖ తన లేఖ ద్వారా స్పష్టమైన వివరణ ఇచ్చారు. కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతమైనవని పదేపదే నొక్కి చెప్పారు. పార్టీలోని వివిధ వర్గాలు ఈ అభివృద్ధిని గమనిస్తున్నాయి. క్రమశిక్షణ కమిటీ తదుపరి సమావేశంలో ఈ అంశాన్ని చర్చించే అవకాశం ఉంది. మంత్రి లేఖలోని వివరాలు అన్నీ అధికారిక రికార్డుల్లో చేరాయి. రాష్ట్ర వ్యాప్తంగా మీడియా ఈ విషయాన్ని విస్తృతంగా కవర్ చేస్తోంది. సురేఖ వైఖరి పార్టీ అంతర్గత గతిని ప్రభావితం చేస్తుందని అంచనా. లేఖలో మంత్రి సురేఖ తన కుటుంబ సభ్యుల వ్యక్తిగత అభిప్రాయాలను తన రాజకీయ బాధ్యతల నుంచి వేరు చేయాలని వాదించారు. కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు ఆమె స్వంత నిర్ణయాల ఆధారంగా ఉన్నాయని స్పష్టం చేశారు. గీసుకొండలో జరిగిన కార్యక్రమంలోని ప్రసంగాలు వ్యక్తిగత స్థాయికి పరిమితమైనవని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సేవా కార్యక్రమాలు కుటుంబ అభిమానులు కాంగ్రెస్ కార్యకర్తల సహకారంతో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాల్లో ఎలాంటి పార్టీ వ్యతిరేక వైఖరి లేదని మంత్రి వివరించారు. సహజ న్యాయ సూత్రాల ప్రకారం ఒక వ్యక్తి వ్యక్తిగత మాటలకు మరొకరిని బాధ్యులను చేయకూడదని గుర్తుచేశారు. పార్టీ నాయకత్వంపై తనకు పూర్తి గౌరవం ఉందని మరోసారి నొక్కి చెప్పారు. నోటీసు ఉపసంహరణ కోసం కమిటీని కోరడం ద్వారా తన వైఖరిని స్పష్టం చేశారు. లేఖలోని ప్రతి వాక్యం అధికారిక స్వభావం కలిగి ఉంది. ఈ వివరాలు కమిటీ ఛైర్మన్ దృష్టికి చేరాయి. క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన షోకాజ్ నోటీసు నేపథ్యంలో సురేఖ లేఖ రాయడం పార్టీలో కొత్త చర్చలకు దారితీసింది. కుమార్తె వ్యాఖ్యల నుంచి తాను దూరంగా ఉన్నట్లు చెప్పుకుంటూ నోటీసు ఉపసంహరణ కోరడం ఆసక్తికరంగా మారింది. రాష్ట్ర రాజకీయ వర్గాలు ఈ అభివృద్ధిని సన్నిహితంగా గమనిస్తున్నాయి. మంత్రి లేఖలో పేర్కొన్న అంశాలు అన్నీ వాస్తవాల ఆధారంగా ఉన్నాయని ఆమె వాదించారు. జన్మదిన వేడుకల సందర్భంగా జరిగిన కార్యక్రమాలు సేవా దృక్పథంతో నిర్వహించబడ్డాయని వివరించారు. కుమార్తె ప్రసంగాలు వ్యక్తిగత అభిప్రాయాలకు పరిమితమైనవని పదేపదే చెప్పారు. సహజ న్యాయ సూత్రాలను ఉల్లంఘించకుండా వ్యవహరించాలని కమిటీని కోరారు. పార్టీ క్రమశిక్షణా నియమావళిని గౌరవిస్తూ తన వైఖరిని వెలిబుచ్చారు. ప్రజాస్వామ్య విలువలు వాస్తవాలు ప్రాధాన్యం కలిగి ఉండాలని సూచించారు. ఈ లేఖ ద్వారా సురేఖ తన స్పష్టమైన వైఖరిని నమోదు చేశారు. మొత్తంగా చూస్తే మంత్రి కొండా సురేఖ లేఖలో తన కుమార్తె వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని స్పష్టం చేస్తూ నోటీసు ఉపసంహరణ కోరారు. కుటుంబ బంధాన్ని ఆసరాగా చేసుకుని రాజకీయంగా నెపం మోపడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని తేల్చిచెప్పారు. ఆగస్టు 19న జరిగిన జన్మదిన వేడుకల్లో కుమార్తె పాల్గొన్న విషయాన్ని వివరించారు. వ్యక్తిగత అభిప్రాయాలకు తనను బాధ్యురాలిని చేయడం తగదని అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్టీ నాయకత్వంపై గౌరవం ఉందని స్పష్టం చేశారు. క్రమశిక్షణ కమిటీ ఈ లేఖను పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్ర రాజకీయ వర్గాలు ఈ వ్యవహారం పైనే దృష్టి సారించాయి. మంత్రి వైఖరి పార్టీ అంతర్గత చర్చలను మరింత విస్తృతం చేసింది. లేఖలోని వివరాలు అన్నీ అధికారికంగా నమోదు అయ్యాయి. ఈ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీలో కొత్త దశను సూచిస్తోంది.

## శంషాబాద్–చెన్నై బుల్లెట్ రైలు పాత మార్గాన్నే కొనసాగించాలి

- రైలు మార్గం సాధనకు పెద్దఎత్తున ఉద్యమిస్తాం
- బీజేపీ కిసాన్ మోర్చా మాజీ రాష్ట్ర కార్యదర్శి కనగాల నారాయణ హెచ్చరిక



**కోదాడ, విశాలభారతి:** శంషాబాద్ నుండి చెన్నై వరకు ప్రతిపాదించిన బుల్లెట్ రైలు మార్గాన్ని పాత ప్రతిపాదన ప్రకారమే కొనసాగించాలని, దారి మళ్లింపు ప్రయత్నాలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని బీజేపీ కిసాన్ మోర్చా మాజీ రాష్ట్ర కార్యదర్శి కనగాల నారాయణ స్పష్టం చేశారు. గురువారం కోదాడ పట్టణంలో ఆ పార్టీ నాయకులతో జరిగిన ముఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వంలోని కొందరు నాయకులు కుంటిసాకులు చూపుతూ రూట్ మార్చడానికి కుట్రలు చేస్తున్నారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ఈ విషయమై సూర్యాపేట జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని, కోదాడ ప్రాంత ప్రజల ప్రయోజనాల కోసం పాత మార్గాన్నే ఖరారు చేసేలా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతామన్నారు. బుల్లెట్ రైలు పాత మార్గం సాధన కోసం బీజేపీ పిలుపునిచ్చే ఉద్యమ కార్యక్రమాలకు నియోజకవర్గంలోని మేధావులు, విద్యావేత్తలు, వర్తకులు, మహిళలు, యువత పెద్దఎత్తున మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి యరగాని కళావతి రాధాకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు జల్లా జనార్ధన్, భూమా శ్రీనివాస్, అనంతగిరి మండల అధ్యక్షుడు చింతకుంట్ల సతీష్, చిలుకూరు మండల అధ్యక్షుడు పారెల్లి మహేష్, నడిగూడెం మండల అధ్యక్షుడు బండారు వీరబాబు, మునగాల మాజీ మండల అధ్యక్షుడు భద్రంరాజు కృష్ణ ప్రసాద్, కోదాడ రూరల్ మాజీ మండల అధ్యక్షుడు దేవరశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలి

- ఎంపీడీవో సంకీర్త్



**పినపాక, విశాల భారతి :** పినపాక మండల పరిధిలోని భూపాలపట్నం గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో సంకీర్త్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గురువారం భూపాలపట్నం గ్రామంలో మంజూరైన ఇళ్ల నిర్మాణ పురోగతిని, లబ్ధిదారులకు అందుతున్న మౌలిక వసతులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ విభాగం ఏఈ నసీరుద్దీన్, గ్రామ సర్పంచ్ స్వప్న, ఉప సర్పంచ్ శిరీష, పంచాయతీ కార్యదర్శి అరుణశ్రీ, వార్డు సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే దంపతుల పెళ్లిరోజు వేడుక

- శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపిన పబ్బు రాజు గౌడ్



**చౌటుప్పల్ విశాల భారతి:** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శ్రీమతి లక్ష్మి గార్ల వివాహ వార్షికోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ _ పబ్బు రాజు గౌడ్ _ వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పబ్బు రాజు గౌడ్ మాట్లాడుతూ.. రాజకీయాల్లో ఎంత బిజీగా ఉన్నా కుటుంబానికి ప్రాధాన్యత ఇస్తూ ఆదర్శ దంపతులుగా నిలుస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లక్ష్మి గార్ల దాంపత్యం అందరికీ ఆదర్శమని కొనియాడారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మునుగోడు ప్రజల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని, వారికి అండగా లక్ష్మి నిలుస్తూ వారి విజయంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. వారి దాంపత్య జీవితం ఇలాగే సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సాగాలని, భగవంతుడు వారికి మరిన్ని ఉన్నత పదవులు అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. వారి వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## గాలి రమేష్ నాయుడు ఆశయాలను సాధిస్తాం

**పచ్చిపాల రామకృష్ణ యాదవ్**



**విశాలభారతి, మునగాల:** దివంగత కాంగ్రెస్ నాయకుడు స్వర్గీయ గాలి రమేష్ నాయుడు 37వ వర్ధంతి సందర్భంగా మునగాల బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు ఉచితంగా ఎగ్జామ్ ప్యాడ్లను పంపిణీ చేశారు. బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ పాల్గొని రమేష్ నాయుడు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రమేష్ నాయుడు విద్యార్థి దశ నుంచే ఎన్ఎస్‌యూఐలో పనిచేస్తూ ఎంతోమంది విద్యార్థులకు అండగా నిలిచారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం తమ్ముడు గాలి శ్రీనివాస్ నాయుడు ప్రతి సంవత్సరం 63 రోజుల పాటు వేలాది మంది అయ్యప్పలకు అన్నదానం చేయడంతో పాటు అనేక సామాజిక సేవలు అందిస్తున్నారని కొనియాడారు. రమేష్ నాయుడు స్మారకార్థం నిరుపేదలకు మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సేన జాతీయ కార్యదర్శి డాక్టర్ నరాల రుక్మారావు, హాస్టల్ వార్డెన్ నరేష్, బాలాజీ, సతీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు

## సీతానగరం గ్రామంలో ఘనంగా బోనాల పండుగ

**భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించిన మహిళలు**

**విశాలభారతి, మునగాల:** సూర్యాపేట జిల్లా మునగాల మండలం సీతానగరం గ్రామంలో బోనాల పండుగను గ్రామ ప్రజలు అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు శ్రావణ మాస పూజలను పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో బోనాలను తలపై ఎత్తుకొని అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పండుగ సందర్భంగా ముత్యాలమ్మ ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, పచ్చని తోరణాలతో ప్రత్యేకంగా అలంకరించి, అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి, పసుపు, కుంకుమలతో అలంకరించిన బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లు, మంగళ వాయిద్యాల మోతతో సీతానగరం గ్రామంలో ఆధ్యాత్మిక పండుగ వాతావరణం సంతరించుకుంది. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని భక్తులు అమ్మవారికి ఘటాలు సమర్పించి ప్రార్థించారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళలు, యువతీ యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



## మునగాల మండల కేంద్రంలో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

- భారతదేశ సాంకేతిక విప్లవ ప్రదాత రాజీవ్ గాంధీ: కాంగ్రెస్ నాయకులు



**విశాలభారతి, మునగాల:** సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలో భారత మాజీ ప్రధాన మంత్రి, స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ గారి జయంతి వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ముందుగా రాజీవ్ గాంధీ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి, చేతులు జోడించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మాట్లాడుతూ... భారతదేశ ఆధునిక సాంకేతిక రంగానికి, కంప్యూటర్ విప్లవానికి శ్రీకారం చుట్టిన గొప్ప సంస్కర్త రాజీవ్ గాంధీ అని కొనియాడారు. దేశ సమగ్రత కోసం, యువత సాధికారత కోసం ఆయన ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని గుర్తుచేశారు. ఓటు హక్కు వయస్సును 21 ఏళ్ల నుండి 18 ఏళ్లకు తగ్గించి దేశ రాజకీయాల్లో యువతకు పెద్దపీట వేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సమాచార సాంకేతిక (ఐటీ) రంగంలో భారతదేశం నేడు ప్రపంచ స్థాయికి చేరడానికి ఆనాడే రాజీవ్ గాంధీ వేసిన పునాదులే కారణమని స్మరించుకున్నారు. మండలంలో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుండి మరింత బలోపేతం చేస్తూ, ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. రాజీవ్ గాంధీ గారి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్క కార్యకర్త నిబద్ధతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చి పాపయ్య, జానకి రెడ్డి, కాలే సామిల్ ఎలక నరేందర్ రెడ్డి, గన్న నరసింహారావు, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, వేనపల్లి వీరబాబు ఈదర్ రావు, రవి సార్, కాసర్ల వెంకట్, గండు అంజయ్య, శ్రీను, శర్మ, విజయ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తక్కెలపాటి సాయి, కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల నాయకులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ రూపారెడ్డికి ప్రగతి పాఠశాల ఘన నివాళి

- ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించిన యాజమాన్యం, ఉపాధ్యాయులు
- విద్యారంగానికి ఆమె మృతి తీరని లోటని సంతాపం

విశాలభారతి ఆదిలాబాద్ బ్యూరో: ప్రిన్సిపాల్ రూపారెడ్డి మృతి పట్ల ప్రగతి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గురువారం పాఠశాల ఆవరణలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించి, ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ మౌనం పాటించారు. ఈ సందర్భంగా రూపారెడ్డి విద్యారంగానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం ఆమె చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆమె మృతి విద్యారంగానికి తీరని లోటని పేర్కొంటూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ప్రగతి పాఠశాల కరస్పాండెంట్ సురకంటి వనమాల, ప్రిన్సిపాల్ k. ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ మంజుల, నిజామోద్దీన్, పీఈటీ అల్లం సాయికిరణ్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్‌కు సీపీఐ ఘన సన్మానం



**కురవి విశాల భారతి:** కాంగ్రెస్ పార్టీ కురవి మండల అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన బాలగాని శ్రీనివాస్ గౌడ్‌కు సీపీఐ మండల నాయకులు ఘనంగా సన్మానం చేసి అభినందనలు తెలిపారు. కురవి మండల కేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రామచంద్ర నాయక్ బాలగాని శ్రీనివాస్ గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ కురవి మండల అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఆత్మ కమిటీ ఛైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు చెందిన అర్హులైన పేదలకు చేరేలా కృషి చేయాలని కోరారు. మండలంలో చేపట్టే అభివృద్ధి పనుల్లో పారదర్శకత పాటించేలా చూడాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు మిత్రపక్షమైన సీపీఐకి సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్‌ను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలకు అతీతంగా సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కురవి టౌన్ కార్యదర్శి తురక రమేష్, బుడమ వెంకన్న, దూదికట్ల సారయ్య, కన్నె వెంకన్న, బొల్లం ఉప్పలయ్య, కలగుర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ అభయహస్తం హామీలను అమలు చేయాలి

- ఈ నెల 25న 'చలో కోదాడ' బహిరంగ సభను విజయవంతం చేయాలి
- ఎమ్మార్పీఎస్ కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు బచ్చలకూరి నాగరాజు మాదిగ పిలుపు

**కోదాడ, విశాలభారతి:** ప్రభుత్వం ఎన్నికల్లో దళితులకు ప్రకటించిన అంబేద్కర్ అభయహస్తం హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, ఈ నెల 25న కోదాడ వర్తక సంఘం ప్రాంగణంలో నిర్వహించనున్న 'చలో కోదాడ' బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు బచ్చలకూరి నాగరాజు మాదిగ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు కేదాసి మోహన్ మాదిగ ల ఆదేశాల మేరకు.. గురువారం కోదాడ మండల పరిధిలోని రెడ్లకుంట గ్రామంలో మండల అధ్యక్షుడు నారకట్ల ప్రసాద్ ఆధ్వర్యంలో సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడి సాధించుకున్నప్పటికీ, దళితుల సంక్షేమానికి ఇచ్చిన హామీలు నెరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం ప్రతి దళిత కుటుంబానికి 'అంబేద్కర్ అభయహస్తం' కింద రూ. 12 లక్షల ఆర్థిక సహాయం అందించాలని, అసైన్డ్ భూములపై పూర్తి అమ్ముకునే హక్కు కల్పిస్తూ వెంటనే జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే భూమి లేని దళితులకు భూమి కేటాయించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్యకు ఆర్థిక సహాయం మరియు ప్రతి మండలంలో గురుకులాల ఏర్పాటును పూర్తి చేయాలని కోరారు. దళితులకు ఇచ్చిన హామీలను నిర్లక్ష్యం చేస్తే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి పోలంపల్లి శ్రీనివాస్ మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కలకొండ ఆదినారాయణ, కుటుంబరావు, మరియమ్మ, మోషే, వినోద్, రాజయ్య, వీరబాబు, కార్తీక్, వెంకటేశ్వర్లు మరియు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోస్టర్లు వేస్తే చర్యలు తప్పవు

- సర్కిల్–51లో పోస్టర్ రహిత ప్రాంతం
- అనుమతి లేకుండా ముద్రించినా, అంటించినా జరిమానా

**సైబరాబాద్ - విశాల భారతి**

ఆల్విన్ కాలనీ సర్కిల్-51 పరిధిలో అనధికార పోస్టర్లు, గోడ రాతలకు అడ్డుకట్ట వేసేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ప్రాంతాన్ని పోస్టర్ రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రింటింగ్ ప్రెస్‌లు, థియేటర్ల యజమానులతో డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి గురువారం సమావేశం నిర్వహించారు. అనుమతి లేకుండా పోస్టర్లు ముద్రించడం, గోడలకు అంటించడం, బహిరంగ ప్రదేశాల్లో అనధికారిక రాతలు రాయడంపై నిషేధం విధిస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్ స్పష్టం చేశారు. ఏదైనా ప్రచార సామగ్రిని ముద్రించే ముందు ప్రింటర్లు తప్పనిసరిగా డిప్యూటీ కమిషనర్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి పోస్టర్లు ముద్రించినా, అంటించినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. సర్కిల్-51ను పరిశుభ్రంగా, సుందరంగా ఉంచేందుకు సీఎంసీ చేపట్టిన పోస్టర్ రహిత కార్యక్రమానికి ప్రింటింగ్ ఏజెన్సీలు, థియేటర్ల యాజమాన్యాలు సహకరించాలని అధికారులు కోరారు.



# సర్పంచ్ ల 14 డిమాండ్లతో పంచాయతీరాజ్ కమిషనర్‌కు వినతి

- జాయింట్ చెక్ పరును రద్దు చేయండి
- సర్పంచ్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు భీమిడి ప్రదీప్ జి
- నిధులను నేరుగా వాడుకునేందుకు జనరల్ అకౌంట్ ను ఇవ్వాండి
- టేకుల మంజుల దిలీప్ రెడ్డి సర్పంచ్ల ఫోరం జిల్లా మహిళా అధ్యక్షురాలు

**చౌటుప్పల్,విశాల భారతి:**



తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలు, గ్రామాభివృద్ధిలో ఎదురవుతున్న ఇబ్బందులపై తెలంగాణ రాష్ట్ర పంచాయతీ సర్పంచ్ ల సంఘం రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కి వినతిపత్రం అందజేసింది. గురువారం నాడు హైదరాగూడ, ఓల్డ్ ఎమ్.ఎల్.ఏ. క్వార్టర్స్ నుండి సంఘం లెటర్ హెడ్ పై కమిషనర్ కు రాసిన లేఖలో, గ్రామాలలో సర్పంచులు మూకుమ్మడిగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను తక్షణమే పరిష్కరించాలంటూ యాదాద్రి భువనగిరి జిల్లా సర్పంచ్ల ఫోరం మహిళా అధ్యక్షురాలు టేకుల మంజుల దిలీప్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా సంఘం ప్రభుత్వం ముందు ఉంచిన ప్రధాన డిమాండ్లు,జాయింట్ చెక్ పవర్ రద్దు చేయాలి లేదంటే రాజకీయ విభేదాల కారణంగా గ్రామాభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతుందని,సర్పంచులకు పూర్తి అధికారాలు 15వ ఆర్థిక సంఘం నిధులపై, పల్లె ప్రగతి నిధులపై పూర్తి అధికారం ఉండాలి. "టైడ్ అన్ టైడ్ యాక్టివిటీ" కండీషన్ తొలగించాలి.గ్రామ పంచాయతీ నిధులను నేరుగా వాడుకునేందుకు జనరల్ అకౌంట్ ఇవ్వాలి,సర్పంచ్ ల గౌరవ వేతనం రూ. 6,500 నుండి రూ. 25,000/లకు పెంచాలి.గ్రామ పంచాయతీ కరెంటు బిల్లులను ప్రభుత్వమే నేరుగా చెల్లించాలి.5 సం.ల కాల పరిమితి వరకు సర్పంచ్ లందరికీ ఆరోగ్య మరియు జీవిత భీమా ఇప్పించాలి. గ్రామ పంచాయతీ పరిధిలోని అనుమతులు (గృహ నిర్మాణ, పరిశ్రమల, లేఅవుట్ అనుమతి) సర్పంచ్ పరిధిలో ఉండాలి.ఎం.ఎల్.సి. ఎన్నికల్లో సర్పంచ్ లకు ఓటు హక్కు కల్పించాలి.గ్రామ పంచాయతీ పరిధిలోని ఇసుక రెవెన్యూ, గ్రానైట్ మరియు తదితర అనుమతులు సర్పంచ్ కి చెందాలి.73, 74 రాజ్యాంగ సవరణలో చేర్చబడిన 243 ఆర్టికల్ లోని 29 అంశాలను గ్రామ పంచాయతీలకు అధికారం ఇవ్వాలి.స్టేట్ ఫైనాన్స్ నిధులను గ్రామ పంచాయతీలకు వెంటనే విడుదల చేయాలి.గతంలో విధంగా గ్రామ పంచాయతీ పరిధిలోని భూముల రిజిస్ట్రేషన్ ఫీజులను 50% గ్రామ పంచాయతీ అకౌంట్ లో నేరుగా జమ చేయాలి.గ్రామ పంచాయతీలోని కార్మికుల సంఖ్యను పెంచుట మరియు వారి జీతభత్యాలను పెంచి ఆఫీసర్ స్థాయిలో ఇవ్వాలని తెలిపారు. సర్పంచుల సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని సంఘం నేతలు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు సోదాని భూమన్న యాదవ్,వర్కింగ్ ప్రెసిడెంట్ జక్క రాఘవేందర్ రెడ్డి,స్టేట్ వైస్ ప్రెసిడెంట్ భీమిడి ప్రదీప్ జీ,స్టేట్ జనరల్ సెక్రటరీ కరణం కీర్తి రామకృష్ణ,స్టేట్ సెక్రటరీ పండిట్ రావ్ పాటిల్,స్టేట్ సెక్రటరీ తలారి వెంకటేష్,స్టేట్ సెక్రటరీ వెంకటేష్,స్టేట్ జాయింట్ సెక్రటరీ లోయ శ్రీనివాస్ రావు,స్టేట్ జాయింట్ సెక్రటరీ చీర్ల అనూష యాదవ్ లు పాల్గొన్నారు.



## మాజీ మంత్రి డీఎస్ రెడ్యా నాయక్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**శాలువా కప్పి సన్మానించిన కురవి జర్నలిస్టులు.. పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు**

**కురవి విశాల భారతి:** మాజీ మంత్రి డీఎస్ రెడ్యా నాయక్‌కు కురవి మండల జర్నలిస్టులు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన వేడుకల సందర్భంగా జర్నలిస్టులు ఆయనను మర్యాదపూర్వకంగా సన్మానించి, శాలువా కప్పి ఘనంగా అభినందించారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో డీఎస్ రెడ్యా నాయక్ చేసిన సేవలను గుర్తుచేశారు. ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో, ప్రజలతో మమేకమై పనిచేయడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రజా సేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

**జర్నలిస్టుల సత్కారంతో ఆత్మీయ వాతావరణం**

డీఎస్ రెడ్యా నాయక్‌ను జర్నలిస్టులు ఒకే వేదికపై సత్కరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసిన అనంతరం జర్నలిస్టులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, జర్నలిస్టులు పరస్పరం అభినందనలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాల జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బేతమల్ల సహదేవ్, టీయూడబ్ల్యూజేయూ కురవి మండల ఉపాధ్యక్షులు గండమాల రోశయ్య, సీరోలు మండల ప్రధాన కార్యదర్శి మడ్డి వీరన్న గౌడ్, జర్నలిస్టు నాయకులు పొన్నెబోయిన వెంకన్న, బానోత్ దేవేందర్, చిన్నగూడూరు ఆంధ్రప్రభ డోర్నకల్ ఇన్‌చార్జి బోయిని నరేందర్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా నాయకులు ఆజ్మీర కోటేష్ తదితరులు పాల్గొన్నారు. మాజీ మంత్రి డీఎస్ రెడ్యా నాయక్ జన్మదినాన్ని పురస్కరించుకుని జర్నలిస్టులు నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమం ఆత్మీయంగా కొనసాగింది. ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన జర్నలిస్టులు భవిష్యత్తులోనూ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో తమ వంతు పాత్ర పోషిస్తామని పేర్కొన్నారు.

## దేవాదుల నీళ్లు మూడు రోజుల ముచ్చటే

**ఎర్రబెల్లి దయాకర్ రావు**





**దేవరుప్పుల విశాల భారతి :** దేవాదుల రిజర్వాయర్ నుంచి నవాబుపేట రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేశామని గొప్పలు చెప్పుకోవడం తప్ప రైతులకు ప్రయోజనం ఏమి కలిగిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. నీరు విడుదల చేసినట్లు చెబుతున్నా దేవరుప్పుల మండలంలోని కాలువలకు చుక్క నీరు చేరలేదని ఆరోపించారు. దేవరుప్పుల మండలంలోని ధరావత్ తండా నుంచి బంజార గ్రామం వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర కాలువ వెంట ఎర్రబెల్లి దయాకర్‌రావు పాదయాత్ర చేసి పరిస్థితిని పరిశీలించారు. మార్గమధ్యలో వరి పొలాలను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సింగరాజుపల్లిలో నిర్వహించిన ధర్నాలో పాల్గొని సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ధర్నా సందర్భంగా పోలీసులు ఎర్రబెల్లిని అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా బీఆర్ఎస్ నాయకులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఈ ఘటనలో ఎర్రబెల్లి తలకు స్వల్ప గాయమైనప్పటికీ ధర్నా కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవాబుపేట రిజర్వాయర్‌కు నిజంగా నీరు విడుదల చేసి ఉంటే దేవరుప్పుల మండలంలోని ఏ చెరువు నిండిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. పాలకుర్తి నియోజకవర్గంలోని దేవరుప్పుల, కొడకండ్ల మండలాలకు సాగునీరు అందే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ధరావత్ తండాకు చెందిన రైతు కున్సోతు వెంకన్న 16 బోర్లు వేసినా ఒక్కటి కూడా పడలేదని, నాలుగు ఎకరాల్లో పంట ఎండిపోయిందని కన్నీటిపర్యంతమయ్యారని ఎర్రబెల్లి తెలిపారు. రైతులకు అండగా ఉంటామని, పంట నష్టానికి ఎకరాకు రూ.30 వేల పరిహారం చెల్లించే వరకు నిరసనలు కొనసాగిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో దేవరుప్పుల, గుండాల మండలాలకు చెందిన రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నివాళులు




**దేవరుప్పుల విశాల భారతి :** దివంగత మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దావెర అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. కార్యక్రమంలో మండల ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షులు ఇనుముల నాగరాజు, భూక్య సజ్జన్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఉప్పల సాయి ప్రకాష్, మండల నాయకులు రెడ్డి రాజుల రమేష్, తోటకూరి రమేష్, నరసింహ, రెడ్డి రాజుల యాకన్న, పులి పంపుల సురేష్, మాసంపల్లి మహేందర్, చెన్నూరి రాంబాబు, దౌపటి నర్సయ్య, సుడిగల నరేష్, పానుగంటి ప్రశాంత్, బట్ట యాదగిరి, తీగల కృష్ణ, బుర్ర ప్రభాకర్, శంకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు. యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్లు లోడంగి అశోక్ యాదవ్, పులిగిల్ల అఖిల్ పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్మికుల ఒక్కరోజు దీక్ష




**దేవరుప్పుల విశాల భారతి :** పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దేవరుప్పుల మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో గ్రామ పంచాయతీ కార్మికులు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఒక్కరోజు దీక్ష చేపట్టారు.ఈ దీక్షకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బస్వ రాంచందర్, కోశాధికారి బత్తిని వెంకన్న హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్షుడు సంగి కర్ణాకర్‌తో కలిసి వారు మాట్లాడుతూ మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, 51వ జీవోను సవరించాలని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సింగారపు రమేశ్, ఐలయ్య, సైదులు, శంకర్, కళమ్మ, జయమ్మ, సోమయ్య, యాదగిరి, వెంకన్న, అంజయ్య పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ ఆశీర్వాదం

**దేవరుప్పుల విశాల భారతి :** మండలం ధర్మ గడ్డ తండా కు చెందిన బూడిద ప్రభాకర్ రాణి దంపతుల కుమార్తె త్రిష శివకుమార్ లో వివాహం లింగాల గణపురం మండలం వడిచర్ల లోని నక్షత్ర గార్డెన్ లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు దేవరుప్పుల సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దేవరుప్పుల వార్డు సభ్యులు శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలపై పోరాటమే సీపీఐ లక్ష్యం




**మార్పు కావాలి నినాదంతో ప్రజా చైతన్య పాదయాత్ర.. ముత్యాల యాదిరెడ్డి**

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :**

దేశంలో పేదలు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి సారించకుండా మత రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తోందని ఆయన విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 'బద్లావ్ జరూరీ హై.. మార్పు కావాలి' అనే నినాదంతో సీపీఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల సమితి ఆధ్వర్యంలో గురువారం ప్రజా చైతన్య పాదయాత్ర నిర్వహించారు. మెట్టు మండల కేంద్రంలోని సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహానికి పూలమాల వేసి పాదయాత్రను ప్రారంభించారు. అనంతరం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని వివిధ ప్రాంతాల మీదుగా యాత్ర కొనసాగింది.జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలోని పలు వాడల్లో పాదయాత్ర నిర్వహించి, కాలనీ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ.. నల్లధనాన్ని దేశానికి తీసుకొచ్చి ప్రజల ఖాతాల్లో వేస్తామని చెప్పి కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మతం పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజల అసలు సమస్యలను పక్కదారి పట్టిస్తోందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై ఉద్యమిస్తున్న వారిపై అణచివేత చర్యలకు పాల్పడటం సరికాదని అన్నారు. ప్రజా ఉద్యమాలను అణిచివేసే ప్రయత్నాలను ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. విద్య, ఉపాధి రంగాల్లో కూడా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. నూతన విద్యా విధానం2020తో విద్యా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతోందని, నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యాదిరెడ్డి అన్నారు. ప్రతి కుటుంబానికి ఇల్లు, తిండి, దుస్తులు, ఉపాధి వంటి కనీస అవసరాలు అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా జరిగే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సీపీఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు సెప్టెంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న ర్యాలీని విజయవంతం చేయాలని యాదిరెడ్డి కోరారు. ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజా చైతన్య పాదయాత్రలో భాగంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని రావి నారాయణరెడ్డి కాలనీ ఫేజ్ 3 భూ పోరాట కేంద్రంలో ముగింపు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్, సహాయ కార్యదర్శి కేతరాజు నర్సింహా, వార్డు సభ్యురాలు కేతరాజు మంజుల, బీఓసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ప్రసాద్‌తో పాటు సీపీఐ నాయకులు, విద్యార్థి, యువజన, మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్రెజరీ ద్వారా జీతాల చెల్లింపుపై స్పష్టత

**ఉద్యోగ సంఘాల ధర్నా తాత్కాలిక వాయిదా**

**రాజేంద్రనగర్, విశాల భారతి :**




వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉద్యోగుల జీతాలను ప్రభుత్వం ట్రెజరీ ద్వారా చెల్లించనున్న అంశంపై గత కొన్ని రోజులుగా నెలకొన్న ఆందోళనకు తాత్కాలికంగా తెరపడింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధనా కేంద్రాలు, అన్ని యూనిట్లలోని టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించాల్సిన ధర్నాను తాత్కాలికంగా వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయ అధికారులు వ్యవసాయ టీచింగ్ అసోసియేషన్, నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించారు. చర్చల్లో ట్రెజరీ ద్వారా జీతాల చెల్లింపు నిర్ణయం తాత్కాలికంగా సుమారు మూడు నెలల కాలానికి మాత్రమే ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. వివిధ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తూ ఒకటి కంటే ఎక్కువ చోట్ల జీతాలు పొందుతున్న ఉద్యోగుల డూప్లికేట్ ఖాతాలు, ఉద్యోగుల వివరాలను ప్రక్షాళన చేసే ప్రక్రియలో భాగంగానే ఈ చర్య చేపట్టినట్లు వివరించారు. ఉద్యోగుల వివరాల ప్రక్షాళన ప్రక్రియ పూర్తయిన అనంతరం తిరిగి విశ్వవిద్యాలయం నుంచే జీతాలు చెల్లించే విధానాన్ని పునరుద్ధరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అధికారుల వివరణను, ఉద్యోగుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకున్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులు.. ఉద్యోగుల వివరాల ప్రక్షాళన కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సదుద్దేశంతోనే జరుగుతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారుల విజ్ఞప్తి మేరకు గురువారం నిర్వహించాల్సిన ధర్నాను తాత్కాలికంగా వాయిదా వేయాలని ఉద్యోగ సంఘాలు నిర్ణయించాయి. అయితే విశ్వవిద్యాలయ స్వయం ప్రతిపత్తిని కాపాడుతూ ఉద్యోగుల జీతాల చెల్లింపు అధికారాన్ని తిరిగి విశ్వవిద్యాలయానికే అప్పగించడం అత్యంత కీలకమని సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు. నిర్దేశించిన మూడు నెలల కాలం పూర్తయిన అనంతరం కూడా జీతాల చెల్లింపు అధికారాన్ని తిరిగి విశ్వవిద్యాలయానికి అప్పగించకపోతే తదుపరి కార్యాచరణకు సిద్ధమవుతామని వారు హెచ్చరించారు. ఉద్యోగుల హక్కులు, విశ్వవిద్యాలయ స్వయం ప్రతిపత్తి పరిరక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ చర్చల్లో టీఏఎస్ఏ జనరల్ సెక్రటరీ సౌజన్య, వైస్ ప్రెసిడెంట్ డా. కమలాకర్, నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జయరాం, సలోచన, పరమేశ్, రాజు, రంధర్ తదితరులు పాల్గొన్నారు. ధర్నాకు సంఘీభావం తెలిపిన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ విశ్వవిద్యాలయాల అన్ని యూనిట్లు, పరిశోధనా కేంద్రాలు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులకు సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల హక్కులు, విశ్వవిద్యాలయ స్వయం ప్రతిపత్తి పరిరక్షణ కోసం భవిష్యత్‌లోనూ ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

## ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాసర్ల కోటయ్య ప్రత్యేక పూజలు



**మునగాల, విశాలభారతి:** మండల కేంద్రమైన మునగాల గ్రామంలో వెలిసిన ముత్యాలమ్మ అమ్మవారి పండగ మహోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో వైభవంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి ఆలయాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసర్ల కోటయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నలబోలు జానకిరెడ్డి సందర్శించారు. ఈ పండగ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అర్చనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ముత్యాలమ్మ అమ్మవారి దయాకటాక్షాల వల్ల మునగాల గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ప్రశాంతంగా జీవించాలని ఆకాంక్షించారు. గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతాంగం సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామీణ సంస్కృతీ సంప్రదాయాలకు ఇటువంటి గ్రామ దేవతల పండగలు అద్దం పడతాయని, ఊరి ప్రజలందరూ కలిసికట్టుగా పండగ జరుపుకోవడం సంతోషదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, పండగ కమిటీ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## ప్రజల సంక్షేమమే లక్ష్యం

**గ్రామ అభివృద్ధి మా దెయ్యం.. బాదావత్ రమేష్ రాములు తండా సర్పంచ్**



**విశాల భారతి గూడూరు :** గూడూరు మండల పరి ధిలోని రాములు తండా గ్రామంలో అప్పుడప్పుడు కురిసిన వర్షాలకు గురువారం ఉదయం గ్రామపంచాయతీ సిబ్బందితో వాడ వాడ గల్లి గల్లి రోడ్డు ఇరువైపులా గడ్డి మొలవడంతో దోమలు ఇతర కీటకాలు బ్యాక్టీరియాస్ ఉంటాయి కాబట్టి వర్షాకాలం సీజన్ దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజలకు ఎలాంటి అనారోగ్య పరిస్థితిలు తలెత్తకుండా గ్రామంలో మురికిగుంటలపై రోడ్డుకి ఇరువైపులా బ్లీచింగ్ పౌడర్ చలించడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది యువకులు పాల్గొనడం జరిగింది

## ఎస్ఐని సన్మానించిన గూడూరు టిఆర్ఎస్ నాయకులు



**విశాల భారతి గూడూరు :** గూడూరు మండల కేంద్రానికి నూతనంగా విచ్చేసినటువంటి గౌరవ శ్రీ ఎస్సై చీర్ర రమేష్ బాబుని మర్యాదపూర్వకంగా కలసి శాలవా తో సత్కరించి. సన్మానం చేసిన గూడూరుమండలబిఆర్ఎస్ పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా మాజీ కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ ఖాసిం మాజీ వైస్ ఎంపీపీ ఆరే వీరన్న గూడూరు మండల నాయకులు భానోత్ నరసింహ నాయక్ వాంకుడోత్ కటార్ సింగ్ భూక్య చందర్. చీదురు వెంకన్న బోడ ఎల్లయ్య ఎండి. తాజ్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## భారతరత్న, భారత మాజీ ప్రధానమంత్రి, దివంగత నేత రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు




**మునుగోడు విశాల భారతి :** మునుగోడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు జాల వెంకన్న యాదవ్ , రత్తిపల్లి మాజీ సర్పంచ్ మాదగోని రాజేష్ గౌడ్, జక్కలి అయిలయ్య యాదవ్ , మాజీ ఎంపీటీసీ పందుల భాస్కర్ , కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఆరేళ్ల సైదులు , కొరటికల్ సర్పంచ్ రామలింగయ్య , అప్పారావు , లింగస్వామి పలు గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అల్కాపూర్‌లో గాంధీ పార్కుకు కొత్త కళ.. అభివృద్ధి పనులు ప్రారంభం

**రాజేంద్రనగర్, విశాల భారతి:** నార్సింగి సర్కిల్ పరిధిలోని మణికొండ అల్కాపూర్ టౌన్‌షిప్‌లో ఉన్న మహాత్మా గాంధీ పార్కు పునరుద్ధరణ పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ గురువారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పార్కు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ.. స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు పార్కును మరింత సుందరంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పిల్లలు, మహిళలు, వృద్ధులకు అనుకూలంగా అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు వాకింగ్, వ్యాయామం, విశ్రాంతికి మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. పార్కు పునరుద్ధరణ పూర్తయిన తర్వాత స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు.

# విద్యార్థుల గళాన్ని లాఠీలతో అణచివేస్తారా?

- జీవో 97 రద్దు చేయాలి.. పాలిటెక్నిక్ విద్యను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలి
- శక్తి పాలసీ వెనక్కి తీసుకోవాలి.. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి
- జాతీయ రహదారిపై విద్యార్థుల నిరసన



**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :**

తమ విద్యా హక్కులు, భవిష్యత్తు కోసం న్యాయమైన డిమాండ్లతో ఆందోళన చేపట్టిన పాలిటెక్నిక్ విద్యార్థులపై లాఠీచార్జి చేయడం తీవ్రంగా ఖండించదగిన విషయమని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. జీవో నంబర్ 97ను రద్దు చేయాలని, పాలిటెక్నిక్ కళాశాలలను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని, శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని విద్యార్థులు ఆందోళన చేపట్టారు.

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని సంజీవ్ గాంధీ మెమోరియల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు తరగతులను బహిష్కరించి వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల ఎదుట ధర్నా చేపట్టి తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై నిరసన చేపట్టడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

**సాంకేతిక విద్యను నిర్వీర్యం చేయొద్దు**

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్ మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్య పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే కీలక వ్యవస్థ అని అన్నారు. అలాంటి విద్యా వ్యవస్థను ఇతర శాఖల్లో విలీనం చేయడం వల్ల దాని ప్రత్యేకత దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని, ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

**యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ విలీనం వద్దు**

ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. సాంకేతిక విద్యాశాఖను బలోపేతం చేయాల్సిన సమయంలో విద్యా సంస్థలను ఇతర వ్యవస్థల్లో విలీనం చేయడం వల్ల విద్యార్థులకు నష్టం కలుగుతుందని అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

**కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి**

ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లకుండా వాటిని మరింత బలోపేతం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, ప్రయోగశాలలను ఆధునీకరించాలని, వర్క్‌షాప్‌లను అభివృద్ధి చేయాలని, హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

**స్కాలర్‌షిప్‌ల కోసం విద్యార్థుల ఆవేదన**

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఆర్థిక ఇబ్బందులతో అనేక మంది విద్యార్థులు చదువులు కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పేద విద్యార్థుల విద్యకు అడ్డంకులు లేకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

**నిరసనకు లాఠీచార్జి పరిష్కారం కాదు**

జీవో 97 రద్దు, స్కాలర్‌షిప్‌ల విడుదల తదితర డిమాండ్లతో శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై అబ్దుల్లాపూర్‌మెట్ మండల ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు లాఠీచార్జి చేయడం ఎంతవరకు న్యాయమని విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నించారు. విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం రోడ్డుపైకి వచ్చి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుంటే వారితో చర్చించాలి. లాఠీలతో కొట్టి ఆందోళనను అణచివేయడం పరిష్కారం కాదు" అని వారు అన్నారు. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జిపై ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

**డిమాండ్లు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం**

జీవో నంబర్ 97ను రద్దు చేయడంతో పాటు శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలని, పాలిటెక్నిక్ విద్యను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. అలాగే పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల సహాయ కార్యదర్శి సత్యం, మండల కార్యవర్గ సభ్యులు అరవింద్, చందు, చరణ్, శశి, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎటువంటి అనుమతులు లేకుండా నడుపుతున్న మెడికల్ షాపులుపై చర్యలు తీసుకోవాలి : ఆలేటి మహేష్



**మునగాల : విశాల భారతి** :మండలం లోని కొంతమంది వ్యక్తులు ఎటువంటి అనుమతులు లేకుండా నడుపుతున్న మెడికల్ షాపుల పై చర్య తీసుకోవాలని కోదాడ ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆలేటి మహేష్ అధికారులను కోరారు ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో కష్టపడి నాలుగు సంవత్సరాలు బీఫార్మసీ పూర్తి చేసుకుని బయటికి వెళ్లిన మేము కష్టపడి చదివితే దానికి సంబంధం లేని వ్యక్తులు అలాగే ఎలాంటి నిబంధన లేకుండా డిగ్రీ లేకుండా టెన్త్ ఫెయిల్ అయి ఇంటర్మీడియట్ ఫెయిల్ అయి మెడికల్ షాపులో ఆర్ఎంపీలుగా చలామణి అవుతున్న వారందరిపై సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకొని పర్మిషన్ లేకుండా పిసిఐ లేకుండా మెడికల్ షాపులు రెంటుకు తీసుకొని నిర్వర్తిస్తున్న యజమానులపై తక్షన్స్ తీసుకోవాల్సిందిగా అలాగే రిజిస్టర్ ఫార్మసిస్ట్ మాత్రమే మెడికల్ షాపులో రన్ చేయాలనీ అలాగే అర్హత లేకుండా వైద్యం గాని మెడిసిన్ గాని ఇవ్వద్దని కోదాడ ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘ అధ్యక్షులు ఆలేటి మహేష్ సంబంధిత అధికారులను వెంటనే యాక్షన్ తీసుకోవాలని డిమాండ్ చేశారు

## కరువు ఒక వైపు, కరెంటు కోత మరోవైపు రైతాంగాన్ని పట్టిపీడిస్తున్న సమస్యలు



**మునుగోడు విశాల భారతి :** తెలంగాణ రాష్ట్రంలో నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం ప్రాంతమంతా వర్షాధారం మీద ఆధారపడి పంటలు సాగు చేస్తున్న రైతాంగం, గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లనే ఈ ప్రాంతానికి సాగునీరు కరువైంది. ఈ ప్రాంతమంతా ఈ వ్యవసాయం మీద ఆధారపడి జీవన కొనసాగిస్తున్న ప్రజానీకం, ఈ సంవత్సరం పంటలకు కావలసిన వర్షం పడక చేతికందిన పంట చేను వడలిపోయి తెగుళ్ల బారిన పడుతున్నాయి కాస్తో కూస్తో బోర్ల పైన ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు చేను ఎండిపోకుండా కాపాడుకునే ప్రయత్నంలో భాగంగా మోటర్లు పెడితే సరైన కరెంటు రాకపోవడం వల్లనా మోటర్లు నీళ్లు పోయకపోవడం వలన మానసికంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న రైతాంగం. పంట సాగు చేయడానికి ఎకరానికి దరిదాపు 35 వేల రూపాయలు ఖర్చు చేసి రాత్రి పగలు కష్టపడి.పంట సాగు చేస్తే ప్రకృతి సహకరించక పోగా పంట పెరుగుదలకు కావలసిన ఎరువుల రేట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచడం వలన వ్యవసాయదారులకు ఆర్థిక భారంగా మారింది అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగానికి తక్షణమే ప్రజా ప్రభుత్వం నాణ్యమైన కరెంటు రైతాంగానికి అందజేయాలని గ్లోబల్ అగ్రి ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఫార్మ్ వ్యవస్థాపక అధ్యక్షులు రాఘవేందర్ యాదవ్ అన్నారు.

## జక్కిడి ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్

- కాంగ్రెస్ క్రమశిక్షణా నియమాల ఉల్లంఘనపై కఠిన చర్య
- బూతు వ్యాఖ్యలు, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలపై కమిటీ పరిశీలన
- ఫిర్యాదులు, ఆధారాలు, అందుబాటులోని సమాచారాన్ని సమగ్రంగా పరిశీలించిన కమిటీ
- టీపీసీసీ పబ్లిసిటీ కమిటీ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి



**ఎల్బీనగర్ విశాల భారతి:** పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించారనే ఆరోపణల నేపథ్యంలో ఎల్బీనగర్ కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు జక్కిడి ప్రభాకర్ రెడ్డిపై టీపీసీసీ కఠిన చర్యలు తీసుకుంది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటంతో పాటు, కులాలను కించపరిచేలా అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారనే అంశం టీపీసీసీ పబ్లిసిటీ కమిటీ దృష్టికి రావడంతో, దీనిపై కమిటీ సమగ్రంగా చర్చించి జక్కిడిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయమై కమిటీకి అందిన ఫిర్యాదులు, సంబంధిత ఆధారాలు, అందుబాటులో ఉన్న సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించినట్లు కమిటీ పేర్కొంది. పార్టీ సిద్ధాంతాలు, విధానాలు, క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై ఉపేక్షించేది లేదని స్పష్టం చేసింది. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే చర్యలను కాంగ్రెస్ అధిష్ఠానం, రాష్ట్ర నాయకత్వం తీవ్రంగా పరిగణిస్తుందని తెలిపింది. జక్కిడి ప్రభాకర్ రెడ్డి వ్యవహారశైలి పార్టీ క్రమశిక్షణా నిబంధనలకు, కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న విలువలకు, విధానాలకు విరుద్ధంగా ఉన్నట్లు కమిటీ అభిప్రాయపడింది. అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం కమిటీ నిర్ణయం మేరకు ఆయనను పార్టీ నుంచి తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. టీపీసీసీ పబ్లిసిటీ కమిటీ చైర్మన్, ఎంపీ డా. మల్లు రవి పేరిట జారీ చేసిన ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. పార్టీ నియమ నిబంధనలను ఉల్లంఘించి, పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై భవిష్యత్తులోనూ కఠిన చర్యలు తప్పవని ఈ పరిణామం ద్వారా పార్టీ నాయకత్వం సంకేతాలు ఇచ్చింది.

## ఖైత్లాపూర్ డివిజన్‌లో ఘనంగా రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు

- కలికోట శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు ముఖ్యఅతిథిగా హాజరైన ఎండి మొఇజ్



**కూకట్ పల్లి విశాల భారతి :** ఖైత్లాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీహరి నగర్ కాలనీలో భారత రత్న మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఖైత్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కలికోట శంకర్ గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి మోయిజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ గారి చిత్రపటానికి పూల మాలలు వేసి మహానాయకుడి సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రెసిడెంట్ కలికోట శంకర్ మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి శ్రీకారం చుట్టి, నేటి డిజిటల్ రంగానికి దృఢమైన పునాది వేసిన యుగపురుషుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి దేశ రాజకీయాల్లో యువత భాగస్వామ్యాన్ని పెంచిన ఘనత, పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారా అధికార వికేంద్రీకరణ చేసి గ్రామ స్వరాజ్యానికి బాటలు వేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాల సాధన కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్తా పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరిఫ్, సలీమ్, సుల్తాన్, అమేర్, రాజేష్‌గౌడ్, కర్క పెంటయ్య, తూము మనోజ్, ప్రకాష్,ముదిరాజ్, అల్లు,జహీర్, తబ్రేజ్, జంగీర్, శ్రీకాంత్, కిషన్, నరేందర్, శంకర్,కుమార్, వీరన్నలతో పాటు పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్నికల విధులపై బీఎల్వోలు, సూపర్‌వైజర్లకు శిక్షణ

**నోటీసుల జారీ, బీఎల్వో యాప్ వినియోగంపై అధికారుల అవగాహన**



**సైబరాబాద్ విశాల భారతి:** ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా మియాపూర్ సర్కిల్-48 పరిధిలోని బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు), బీఎల్వో సూపర్‌వైజర్లకు గురువారం ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎన్నికల విధుల్లో భాగంగా చేపట్టాల్సిన ప్రక్రియలు, పాటించాల్సిన నిబంధనలపై అధికారులు సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అర్హులైన ఓటర్ల వివరాల పరిశీలన, అవసరమైన సందర్భాల్లో నోటీసుల జారీ, సంబంధిత ప్రక్రియను నమోదు చేయడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. నోటీసుల జారీ సమయంలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా బీఎల్వో యాప్ వినియోగంపై సిబ్బందికి ప్రత్యేకంగా వివరించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను యాప్‌లో సక్రమంగా నమోదు చేయడం, సంబంధిత సమాచారాన్ని ఎప్పటికప్పుడు నవీకరించడం, ఎన్నికల సంఘం నిర్దేశించిన విధానాలను అనుసరించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. యాప్ వినియోగంలో ఎదురయ్యే సందేహాలను అధికారులు నివృత్తి చేశారు.ఎన్నికల విధులు అత్యంత బాధ్యతతో కూడుకున్నవని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని ఏఈఆర్వో, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. ఎన్నికల సంఘం జారీ చేసే మార్గదర్శకాలు, ఆదేశాలను కచ్చితంగా పాటిస్తూ క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో బీఎల్వోలు, సూపర్‌వైజర్లు కీలక పాత్ర పోషిస్తున్నందున ప్రతి అంశంపై పూర్తి అవగాహనతో పనిచేయాలని సూచించారు.

## కస్తూరిబా గాంధీ ట్రస్ట్‌ను సందర్శించిన 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలు

**సామాజిక బాధ్యతకు చాటిన ట్రైనీ డీఎస్పీలు.. రూ.56 వేల విరాళం అందజేత**

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

పోలీసు అధికారుల్లో మానవతా దృక్పథం, సామాజిక బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలు కస్తూరిబా గాంధీ నేషనల్ మెమోరియల్ ట్రస్ట్‌ను సందర్శించారు. పోలీసు శిక్షణలో భాగంగా నిర్వహించిన ఈ సందర్శనలో ట్రైనీ అధికారులు ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వివిధ సేవా కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ట్రస్ట్‌లోని వృద్ధాశ్రమం, ప్రజ్వల రెస్క్యూ హోమ్, మానసిక వైకల్యంతో ఉన్న వారికి అందిస్తున్న సేవా కేంద్రాలు, మహిళలకు నైపుణ్య శిక్షణ అందించే కేంద్రాలను ట్రైనీ డీఎస్పీలు సందర్శించారు. అక్కడ నివసిస్తున్న వృద్ధులు, రక్షించబడిన మహిళలు, ప్రత్యేక సంరక్షణ అవసరమైన వారితో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి ధైర్యం, భరోసా కల్పిస్తూ పోలీసు వ్యవస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం అక్కడ ఉన్న వారికి స్నాక్స్ పంపిణీ చేశారు.

**ట్రస్ట్ సేవా కార్యక్రమాలపై అవగాహన**

ట్రస్ట్ ఇన్‌చార్జిలు మూర్తి, శ్రీనివాస్, కౌన్సిలర్లు ట్రైనీ డీఎస్పీలకు ట్రస్ట్‌లోని వివిధ విభాగాలను పరిచయం చేశారు. బాధితులకు అందిస్తున్న సేవలు, పునరావాస కార్యక్రమాలు, మహిళల సంక్షేమం, వృద్ధుల సంరక్షణ తదితర అంశాలను వివరించారు. కస్తూరిబా గాంధీ నేషనల్ మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటుకు సంబంధించిన నేపథ్యంతో పాటు దేశవ్యాప్తంగా 22 ప్రాంతాల్లో కొనసాగుతున్న సేవా కార్యక్రమాల గురించి వివరించారు.

**మహిళల స్వయం ఉపాధికి ప్రోత్సాహం**

మహిళలకు వివిధ రకాల నైపుణ్య శిక్షణలు అందిస్తూ వారిని స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహిస్తున్న కార్యక్రమాలను కూడా ట్రైనీ అధికారులు పరిశీలించారు. మహిళలు స్వయంగా తయారు చేసిన జ్యూట్ బ్యాగులను ట్రైనీ డీఎస్పీలు కొనుగోలు చేసి, వారి నైపుణ్యాన్ని, స్వయం ఉపాధి ప్రయత్నాలను ప్రోత్సహించారు.

**మానవతా దృక్పథంతో ₹56 వేల విరాళం**

ట్రస్ట్‌లోని వృద్ధులు, రక్షించబడిన మహిళలు, ప్రత్యేక సంరక్షణ అవసరమైన వారిని కలుసుకున్న అనంతరం వారి పరిస్థితులకు చలించిన ట్రైనీ డీఎస్పీలు తమ వంతు సామాజిక బాధ్యతగా రూ.56 వేల విరాళాన్ని అందించారు. ఈ మొత్తాన్ని ట్రస్ట్ ఇన్‌చార్జి మూర్తికి అందజేశారు. ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీలు మాట్లాడుతూ సమాజంలోని వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం తమకు ఎంతో విలువైన అనుభవమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్ పోలీసు అధికారుల్లో సానుభూతి, మానవతా భావం, సేవా దృక్పథం, సామాజిక బాధ్యతను మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పోలీసు విధులు కేవలం నేర నియంత్రణ, దర్యాప్తు, శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా బాధితులకు అండగా నిలవడం, బలహీన వర్గాలకు రక్షణ కల్పించడం, సమాజంతో మానవీయ సంబంధాలను పెంపొందించడం కూడా ముఖ్యమని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్శనకు అవకాశం కల్పించిన తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఐపీఎస్‌కు ట్రైనీ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. తరగతి గది శిక్షణతో పాటు సమాజంలోని వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా పరిచయం చేసే ఫీల్డ్ విజిట్స్ పోలీసు శిక్షణలో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. డీఎస్పీ ఆదూరి శ్రీనివాసరావు లైజన్ ఆఫీసర్‌గా వ్యవహరించారు.

## ఎస్ ఆర్ ఎస్ పి కాలువ ద్వారా దేవరుప్పల మండలానికి సాగునీరు



**దేవరుప్పుల విశాల భారతి :** స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి విడుదలైన నీరు ఎస్ ఆర్ ఎస్ పి కాలువ ద్వారా దేవరుప్పుల మండలానికి చేరుకోవడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దావెరా అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కాలువ వద్ద నీటి పూజ నిర్వహించి, కొబ్బరి కాయలు కొట్టి నీటికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దావెరా అనిల్ కుమార్ మాట్లాడుతూ.. సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతుల పొలాలకు నీరు చేరడం సంతోషకరమన్నారు. గతంలో కాలువలు చెట్లు, మట్టి, పిచ్చిమొక్కలతో పూడుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారాయని తెలిపారు. ఈ సమస్యను గుర్తించిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కాలువలను శుభ్రం చేయించారని, దీంతో నీటి ప్రవాహం సజావుగా సాగుతోందన్నారు. రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. నీరు రాబోతున్న విషయం ముందుగానే తెలిసిన కొందరు బీఆర్ఎస్ నాయకులు యాత్రలు నిర్వహించి తామే నీళ్లు తీసుకొచ్చామని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. రైతులు వాస్తవాలను గమనిస్తున్నారని అన్నారు. ఎస్ ఆర్ ఎస్ పి కాలువల అభివృద్ధి, మరమ్మతులు, శుభ్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, రైతుల పొలాలకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. దేవరుప్పుల మండల రైతులకు సాగునీరు అందేలా ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి రైతుల తరఫున, మండల కాంగ్రెస్ పార్టీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ వివాదం అవాస్తవం

**న్యాయవాది కిరణ్‌కుమార్**



**మొయినాబాద్ ఆగస్టు 20(విశాలభారతి):** తనపై, అధికారులపై తప్పుడు సమాచారం వెళ్లేలా కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలు అవాస్తవమని న్యాయవాది కె. కిరణ్‌కుమార్ తెలిపారు. రోడ్డు విస్తరణ, ఆక్రమణల విషయంలో తనకు, సర్పంచ్ కృష్ణకు మధ్య వివాదం ఉన్నట్లు వచ్చిన కథనాలను ఆయన ఖండించారు. తన తల్లి కారుకొండ పొన్నమ్మపై, తనపై గతంలో జరిగిన దాడికి సంబంధించి మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అనంతరం సర్పంచ్‌గా ఎన్నికైన కృష్ణ తమపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ, తన తల్లి నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి పనులను అడ్డుకుంటూ మేస్త్రీలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై 17న మొయినాబాద్ ఎంపీడీవోకు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.అలాగే రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రజావాణిలో, మొయినాబాద్ తహసీల్దార్‌కు ప్రభుత్వ భూమి ఆక్రమణలు, ప్లాట్లుగా విక్రయిస్తున్నారన్న అంశంపై గతంలోనే ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు వాస్తవాలను పరిశీలించి, తన తల్లి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కిరణ్‌కుమార్ కోరారు.




## సేంద్రీయ సాగుతో నేల ఆరోగ్య పరిరక్షణ

**మొయినాబాద్ రైతు వేదికలో రైతులకు శిక్షణ**



**మొయినాబాద్, ఆగస్టు 20(విశాలభారతి):** మొయినాబాద్ రైతు వేదికలో సేంద్రీయ వ్యవసాయం, నేల ఆరోగ్య పరిరక్షణ, వాతావరణ మార్పులు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సేంద్రీయ వ్యవసాయ నిపుణురాలు ఆది లక్ష్మి రైతులకు పంచగవ్య, బీజామృతం, జీవామృతం, వేప కషాయం తదితర సేంద్రీయ కషాయాల తయారీ, వినియోగంపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సహజ వనరులతో సేంద్రీయ కషాయాలను తయారు చేసుకోవడం ద్వారా నేల సారాన్ని, పంటల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. పీజేటీఎస్ఏయూ రాజేంద్రనగర్‌కు చెందిన వాతావరణ సూచనల విభాగం రీసెర్చ్ అసోసియేట్ తరుణ్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం మార్పులు, ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులపై రైతులకు వివరించారు. నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్, మండల వ్యవసాయ అధికారి పి. అనురాధ, ఏఈఓలు శ్రీనివాస్, దీనా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, కిసాన్ సంఘం నాయకులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## భారతదేశ ఖ్యాతిని అంతర్జాతీయంగా ఇనుమడింపజేసిన మహోన్నత వ్యక్తి రాజీవ్ గాంధీ: కొత్వాల



**పాల్వంచ విశాల భారతి:** టెక్నాలజీ రంగం లో భారతదేశ ఖ్యాతిని అంతర్జాతీయంగా దేశ విదేశాల్లో చాటిచెప్పిన మహానాయకుడు రాజీవ్ గాంధీ అని పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. భారత మాజీ ప్రధాని, స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా గురువారం కొత్వాల నాయకత్వం లో, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక రాజీవ్ కూరగాయల మార్కెట్ లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి కొత్వాలతో పాటు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ భారతదేశ సాంకేతికతకు ఆధునిక పునాదులు వేసి, దేశంలోనే అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చిన ఘనుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. దేశ అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించిన నేత రాజీవ్ గాంధీ అని అన్నారు. ఆయన కుమారుడు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే కాంగ్రెస్ కార్యకర్తల ధ్యేయం అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కాల్వ భాస్కర్ రావు, కాంగ్రెస్ నాయకులు ఎస్.ఐ. జలీల్,మహిపతి రాములింగం, యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న గౌడ్, నూకల రంగారావు, గంగిరెడ్డి భువన సుందర్ రెడ్డి, సాదం రామకృష్ణ, వై. వెంకటేశ్వరరావు, దారా చిరంజీవి, కాపర్తి వెంకటాచారి, బాలినేని నాగేశ్వరరావు, ఎస్.వి.ఆర్.కె. ఆచార్యులు, కటుకూరి శేఖర్, గంధం నరసింహారావు, మస్నా శ్రీనివాస రావు, సామా వెంకటరెడ్డి, చౌగాని పాపారావు, బూసి శ్రీను, లక్ష్మణ్, ఓలపల్లి రాంబాబు, లింగ్యా, షేక్ బాషా,బ్యాంక్ చారి,డిష్ నాగేశ్వరరావు, బోగిని సందీప్, ఎలకా నాగేశ్వర రావు, మార్కెట్ కమిటీ నాయకులు శివ,సందు ప్రభాకర్,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

# జీవో 118 పునరుద్ధరణ కోసం పోరాటం తప్పదు

**పేద, మధ్యతరగతి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే జీవోను రాజకీయ కక్షతో నిలిపివేయడం సరికాదు : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :**

పేద, మధ్యతరగతి ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న భూ సమస్యలకు పరిష్కారం చూపే దిశగా తీసుకొచ్చిన జీవో 118ను వెంటనే పునరుద్ధరించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి డిమాండ్ చేశారు. రాజకీయ కక్ష, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలకు ఉపయోగపడే జీవోను నిలిపివేయడం సమంజసం కాదని ఆయన అన్నారు. గురువారం తన కార్యాలయంలో కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సుధీర్ రెడ్డి మాట్లాడారు. జీవో 118 సాధన కోసం గతంలో తాను చేసిన కృషి, ఎదుర్కొన్న ఇబ్బందులు, ప్రభుత్వ స్థాయిలో చేసిన ప్రయత్నాలను కాలనీ సంఘాల ప్రతినిధులకు వివరించారు. ఎంతో శ్రమించి సాధించిన




జీవోను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేయడం వల్ల వేలాది మంది పేద, మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన పేర్కొన్నారు. జీవో 118ను పునరుద్ధరించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రెవెన్యూ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం చూపకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని అన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ఒత్తిడి కారణంగా ప్రజలకు ప్రయోజనం కలిగించే జీవోను నిలిపివేయడం సరికాదని ఆయన విమర్శించారు. ప్రజల భూములు, ఇళ్లకు సంబంధించిన సమస్యలకు పరిష్కారం లభించే వరకు తాను ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తానని సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు. చివరి కన్వీనియన్స్ డీడ్ ఇచ్చే వరకు తన పోరాటం ఆగదని, ప్రజల వెంటే ఉంటానని తెలిపారు. జీవో 118 పునరుద్ధరణ కోసం కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజలు కలిసికట్టుగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ కార్యాచరణపై ఒకటి రెండు రోజుల్లో మరోసారి సమావేశమై నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. జీవో పునరుద్ధరణ కోసం అవసరమైన అన్ని మార్గాల్లో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, మునగాల రాఘవేందర్ రావు, మువ్వ సతీష్ చౌదరి, గుజ్జ జగన్ మోహన్ రెడ్డి, కొత్త భాస్కర్ గౌడ్‌తో పాటు ఎస్‌కేడీ నగర్, వైదేహినగర్ నార్త్ కాలనీ, బీఎన్ రెడ్డి నగర్, సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేజ్ 1, ఫేజ్ 2, శ్రీపురం కాలనీ, శ్రీరామ్ నగర్ తదితర కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఐటి రంగానికి పునాదులు వేసిన నాయకుడు రాజీవ్ గాంధీ



**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు యాచారం మండల కేంద్రంలోని యాచారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోటే శ్రీశైలం ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు మోటే శ్రీశైల మాట్లాడుతూ ఆధునిక భారత రూపశిల్పి భారత యువ శక్తికి ప్రేరణ సాంకేతికతను గ్రామీణ భారతానికి చేర్చిన మార్గదర్శి రాజీవ్ గాంధీ అని కొనియాడారు. దేశ ఐక్యత కోసం తన ప్రాణాలు అర్పించిన నాయకుడు. దేశ సమగ్రత కు పాటు పడిన నాయకుడు రాజీవ్ గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు కిషన్ నాయక్ , రాజు గౌడ్ సుగుణ సంపత్ , ఇబ్రహీంపట్నం ఏఎంసి డైరెక్టర్లు మస్కు నరసింహ గులాం అక్బర్,జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలమోని రామకృష్ణ యాదవ్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు గొరిగే హరికిషన్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పాశం జయప్రకాష్ యస్ సి సెల్ ప్రెసిడెంట్ మల్లేష్ వివిధ గ్రామాల ఉపసర్పంచ్ లు దేంది మధుకర్ రెడ్డి నాయిని శ్రీకాంత్ బడే కుమార్ యాట శ్రీనివాస్ వివిధ గ్రామల కమిటీ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్ శ్రీశైలం వెంకటేష్ ఎండీ రని భాస్కర్ యాదయ్య సీనియర్ నాయకులు చీర శేఖర్ లక్ష్మణ్ బేత జంగయ్య బన్నె జంగయ్య వెంకట్ రెడ్డి కానమోని నరేందర్ బుచ్చయ్య రాజు మల్లేష్ యాదగిరి విజయ్ వార్డు సభ్యులు జంగయ్య జావీద్ విక్రమ్ రాకేష్ కొండల్ యూత్ కాంగ్రెస్ వివిధ గ్రామల కమటి అధ్యక్షులు గణేష్ శ్రీశైలం రమేష్ వినోద్ రాకేష్ మున్నా ఎన్ ఎస్ యూ ఐ సోషల్ మీడియా గోపాలి పవన్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై దాడులను అరికట్టాలి

**సీఐ రఘుపతి రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలి.**

**ముషీరాబాద్,విశాల భారతి:** మహబూబాబాద్ పాలిటెక్నిక్ విద్యార్థిపై నిన్న జరిగిన దాడి ఘటనను జెన్ జీ స్టూడెంట్ ఆర్గనైజేషన్ తీవ్రంగా ఖండించింది. విద్యార్థులపై అనుచితంగా ప్రవర్తించిన సీఐ రఘుపతి రెడ్డి పై ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ




చేపట్టి, విచారణ పూర్తయ్యే వరకు సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద 30న జరిగే జెన్ జీ సభ పోస్టర్ను జెన్ జీ స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఫౌండర్ శివాజీ హాజరై ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులు తమ సమస్యలను ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కు అని విద్యార్థుల పట్ల పోలీసు అధికారులు సంయమనంతో, చట్టబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులపై దాడులు, బెదిరింపులకు పాల్పడే ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**విద్యార్థి సమస్యలపై 30న భారీ సభ..**

విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఫీజుల నియంత్రణ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపాధి అవకాశాలు, హాస్టల్ సమస్యలు, స్కాలర్‌షిప్‌లు తదితర సమస్యల పరిష్కారం కోసం జెన్ జీ స్టూడెంట్ ఆర్గనైజేషన్ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 30న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వేదికగా నిర్వహించే భారీ విద్యార్థి సభకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది.ఈ కార్యక్రమంలో జెన్ జీ స్టూడెంట్ ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ నాగునాయక్, ట్రెజరర్ అంజనేయులు, జయలాల్, ప్రకాష్, రాకేష్, సురేష్, అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ స్ఫూర్తితో సద్భావన ర్యాలీ

**విద్యార్థులతో కలిసి నడిచిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**



**కుత్బుల్లాపూర్ విశాల భారతి;** మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా గిరి నగర్ డివిజన్‌లో సద్భావన ర్యాలీ ఘనంగా జరిగింది. కట్టే శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో ఐడీపీఎల్ చౌరస్తా నుంచి నిర్వహించిన ఈ ర్యాలీలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.విద్యార్థులతో కలిసి ర్యాలీలో నడిచిన ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు అమూల్యమని కొనియాడారు.టెలికమ్యూనికేషన్, కంప్యూటర్ టెక్నాలజీని దేశానికి అందించి భారత్‌ను సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లారని, 18 ఏళ్ల వయసులో ఓటు హక్కు కల్పించిన ఘనత కూడా ఆయనదేనని గుర్తు చేశారు. యువత దేశ భవిష్యత్తు అని, సమాజాభివృద్ధిలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.వివిధ పాఠశాలలకు చెందిన దాదాపు 2000 మంది విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శ్రీశైలం గౌడ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన శ్రీకాంత్ యాదవ్‌ను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, జైరామ్, రాములు, మహేష్ గౌడ్, పాఠశాల యజమానులు, ఉపాధ్యాయులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బిజెపి నాయకులు కాంతారావుకు క్షమాపణలు చెప్పాలి

**ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వెన్న అశోక్ కుమార్**




**అశ్వాపురం, విశాల భారతి :** పినపాక నియోజకవర్గం లోని కాంగ్రెస్, బిజెపి పార్టీల నాయకులు రేగా కాంతారావుకు తక్షణమే క్షమాపణలు చెప్పాలని ఎస్సీ సెల్ పినపాక నియోజకవర్గం అధ్యక్షుడు వెన్న అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంతారావు పై పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయిన నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ నుండి ఆయనను తక్షణమే సస్పెండ్ చేసి జైల్లో పెట్టాలని అవాకులు చవాకులు పేలారన్నారు. ఆయన ఎటువంటి తప్పు చేయలేదని తప్పుడు కేసులు పెట్టారని అత్యున్నత న్యాయ స్థానమే క్లీన్ చిట్ ఇచ్చిందన్నారు. మీరు చేసిన ఆరోపణలలో ఎటువంటి నిజం లేదని తేటతెల్లమైందన్నారు. పార్టీ ఉన్నత పదవులలో ఉన్న వారు నిరాధారమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న తమ నాయకుడి పై బురద జల్లే ప్రయత్నం చేసినందుకు క్షమాపణలు చెప్పి తీరాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ నాయకులు సొకబారు రాజకీయాలు మాని కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు అమలయ్యేందుకు కృషి చేయాలన్నారు.

## ముగ్గురు పిల్లలతో మహిళ అదృశ్యం

**ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలన్న సీఐ ఎల్లయ్య**



**అశ్వాపురం, విశాల భారతి :** మండల పరిధిలో ఓ మహిళ తన ముగ్గురు పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన అశ్వాపురం మండలంలో చోటుచేసుకుంది. అశ్వాపురం సిఐ సిహెచ్. ఎల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం...మంచికంటినగర్ గ్రామానికి చెందిన ఊకె సమ్మక్క ఈ నెల 19న సాయంత్రం సుమారు 5.30 గంటల సమయంలో తన ఇద్దరు కుమారులు, ఒక కుమార్తెతో కలిసి ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు తెలిపారు. ఆమె అశ్వాపురం నుంచి కొత్తగూడెం వైపు వెళ్లినట్లు తెలుస్తోందని పోలీసులు పేర్కొన్నారు. వీరి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రజలు ఎవరికైనా వీరినీ, చూసిన వెంటనే అశ్వాపురం పోలీస్ స్టేషన్ తోపాటు ఆచూకీ తెలిసిన సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించాల్సిన ఫోన్లు

**సీఐ సిహెచ్. ఎల్లయ్య, 8712682093, అశ్వాపురం పోలీస్ స్టేషన్ 8712682094 తెలపాలని సిఐ కోరారు. ఆమె తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.**

## జన్వాడ ప్రభుత్వ బడికి రూ.5 కోట్లతో నూతన భవనం.. ప్రారంభించిన సబితా, కాలే యాదయ్య

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

కార్పొరేట్ పాఠశాలలు తమ పరిసరాల్లోని ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకొని అన్ని విధాలా అభివృద్ధి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సూచించారు. శంకర్‌పల్లి మండలం, నార్సింగి సర్కిల్ పరిధిలోని జన్వాడ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కొండకల్ ఇండస్ ఇంటర్నేషనల్ స్కూల్ సౌజన్యంతో నిర్మించిన నూతన పాఠశాల భవనాన్ని గురువారం ఆమె ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రతిభ ఎవరి సొత్తు కాదని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా అవకాశాలు కల్పించాలన్నారు. జన్వాడ ప్రభుత్వ పాఠశాల పాత భవనంగా ఉండటాన్ని గమనించిన తన మనవరాలు అక్షయి పాఠశాల అభివృద్ధి చేయాలని కోరడంతో మాజీ మంత్రి కేటీఆర్ ద్వారా ఇండస్ స్కూల్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీంతో యాజమాన్యం సుమారు రూ.5 కోట్ల వ్యయంతో నూతన భవనాన్ని నిర్మించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత కారణంగా విద్యార్థుల సంఖ్య తగ్గేదని, పేద విద్యార్థుల కోసం అప్పటి ప్రభుత్వం కేజీ నుంచి పీజీ వరకు విద్యతో పాటు 'మన ఊరు-మన బడి' కార్యక్రమాన్ని చేపట్టి వేలాది పాఠశాలలను అభివృద్ధి చేసిందని ఆమె గుర్తుచేశారు. ప్రస్తుతం కార్పొరేట్ పాఠశాలలు తమ సమీపంలోని ప్రభుత్వ బడులను దత్తత తీసుకొని మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు సహకరించాలని కోరారు. రంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు ఇండస్ స్కూల్ యాజమాన్యం ముందుకు రావడం సంతోషకరమన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాలకు ఇండస్ యాజమాన్యం అందజేసిన మూడు ఈగల్ రోబోలు విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో సృజనాత్మక ఆలోచనలను పెంపొందించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు.

**అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: ఎమ్మెల్యే కాలే యాదయ్య**

జన్వాడ ప్రాంత అభివృద్ధికి అన్ని విధాలా కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. జన్వాడ గ్రామంలోని చిరంజీవి నాలాలో పడి పలువురు మృతి చెందిన ఘటనలను ప్రస్తావిస్తూ, సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.10 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. స్థానిక నాయకుడు గౌడిచర్ల వెంకటేష్ విజ్ఞప్తి మేరకు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జన్వాడ ప్రభుత్వ పాఠశాలకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వందలాది మంది విద్యార్థులు వస్తున్నందున ఇంద్రారెడ్డి నగర్ నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా, సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇండస్ స్కూల్ ట్రస్ట్ సీఈవో అర్జున్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేలా నాణ్యమైన విద్యను అందిపుచ్చుకోవాలని, సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవీందర్‌రావు, హెచ్‌ఎం దైవసహాయం రెడ్డి, ఇండస్ స్కూల్ ప్రిన్సిపల్ ఫరీదా ప్రాస్, నాయకులు గౌడిచర్ల వెంకటేష్, మాజీ ఎంపీటీసీ మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంకిరెడ్డిగూడెంలో ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన సదస్సు



- **ప్రభుత్వ లబ్ధి పొందాలంటే రైతులు పంట వేయాల్సిందే**
- **సుర్వి మల్లేష్ గౌడ్ సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు**
- **ఆరుతడి పంటలు వేయాలని సూచన**
- **ఏఈఓ వీణ**

**చౌటుప్పల్,విశాల భారతి:**

మండలం అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆ గ్రామ సర్పంచ్, సర్పంచ్ల ఫోరం చౌటుప్పల్ మండల అధ్యక్షులు సుర్వి మల్లేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో లింగోజిగూడెం క్లస్టర్ ఏఈఓ వీణ రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా ఏఈఓ వీణ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా వరి పంట వేయడం వల్ల వర్షాభావ పరిస్థితుల్లో దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని, అందువల్ల రైతులు ఆరుతడి పంటల వైపు మళ్లాలని సూచించారు. కంది, పెసర, మినుము, బొబ్బర్లు, శనగలు, ఉలవలు, కూరగాయల పంటలు సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో సత్వర లాభాలు పొందవచ్చని వివరించారు. సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ, ప్రతి రైతు తన భూమిని ఖాళీగా ఉంచకుండా తప్పనిసరిగా ఏదో ఒక పంట సాగు చేయాలని, లేనిపక్షంలో ప్రభుత్వం అందించే రైతు సంక్షేమ పథకాలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకులారం మల్లారెడ్డి, దొడ్ల సెట్టయ్య, పర్ణిరామచంద్ర రెడ్డి, ఇటికాల నర్సిరెడ్డి, భీమగోని బాలరాజ్, మోడెపు నరసింహ, పెంటయ్య, జంగయ్య, ముద్దం సెట్టయ్య, వెంకటేశం, శ్రీను, ముత్యాలు, సుర్వి లచ్చయ్య, రాములు, దాసు, గంగిరెడ్డి అంజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, భూపాల్ రెడ్డి, ఇమ్మడి ఏసుదాస్, ఇరగదిండ్ల ఈద్దయ్య, కే. యాదిరెడ్డి, కే. జంగారెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.

## అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం.. భవనానికి సీల్

- **శాంక్షన్ ప్లాన్‌కు భిన్నంగా నిర్మాణం**
- **కమిషనర్ ఆదేశాలతో ఏసీపీ అధికారుల చర్యలు**

**సైబరాబాద్ - విశాల భారతి**

అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన భవనంపై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు.మియాపూర్ డివిజన్ ఇందిరానగర్‌లో శాంక్షన్ ప్లాన్‌కు భిన్నంగా నిర్మించిన భవనాన్ని అధికారులు బుధవారం సీల్ చేశారు. కమిషనర్, డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ కొడారి ఏసీపీ సుష్మ యాదవ్ చర్యలు తీసుకున్నారు.ఇందిరానగర్‌లోని ప్లాట్ నంబర్ 5 (పార్ట్), సర్వే నంబర్ 52లో నిర్మించిన భవనాన్ని అధికారులు పరిశీలించారు. నిర్మాణానికి సంబంధించి మంజూరైన అనుమతులు,శాంక్షన్ ప్లాన్‌ను పరిశీలించగా. క్షేత్రస్థాయిలో చేపట్టిన నిర్మాణం అనుమతించిన ప్రణాళికకు భిన్నంగా ఉన్నట్లు గుర్తించారు. నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణ పనులు చేపట్టినట్లు నిర్ధారణకు రావడంతో భవనంపై చర్యలు తీసుకున్నారు.అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాన్ని నిలువరించేందుకు అధికారులు భవనానికి సీల్ వేశారు. అనధికారిక నిర్మాణాలనుఉపేక్షించబోమని అధికారులు స్పష్టం చేశారు. మున్సిపల్ నిబంధనలు, మంజూరైన నిర్మాణ ప్రణాళికలకు అనుగుణంగానే భవన నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తిస్తే సంబంధిత భవన యజమానులు, నిర్మాణదారులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.అనుమతులు లేకుండా లేదా మంజూరైన ప్రణాళికకు భిన్నంగా నిర్మాణాలు చేపట్టకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది కరణ్, తౌఫిక్, ఉపేందర్ పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

- **ఇందిరాగాంధీ నగర్‌లో రూ.48 లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపన**
- **పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**



**కుత్బుల్లాపూర్ విశాల భారతి:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గిరి నగర్ డివిజన్ పరిధి ఇందిరాగాంధీ నగర్‌లో రూ.48 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో పెద్దఎత్తున అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటివరకు రూ.30 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశామని తెలిపారు. భవిష్యత్తులో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో సీసీ రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఇందిరాగాంధీ నగర్‌లో అర్ధాంతరంగా నిలిచిపోయిన కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పారు.అభివృద్ధి పనులకు సహకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, కలెక్టర్, కమిషనర్ సృజనలకు కూన శ్రీశైలం గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జైరామ్, ఆరవ వెంకటరమణ, గోపాల్ యాదవ్, శంకర్ గౌడ్, రఫీక్, నవాజ్, మోతే శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ రావు, నర్సింగ్ రావు, బలరాం, షకీల్, నాగేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గండిపేట్‌లో పౌర సమస్యలపై కమిషనర్ సమీక్ష

- **వన్ వార్డ్ ఎవరీ డే కార్యక్రమంలో ప్రజల నుంచి సమస్యల స్వీకరణ**



**సైబరాబాద్‌విశాల భారతి:** 'వన్ వార్డ్ ఎవరీ డే' కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గండిపేట్ వార్డులో పౌర సమస్యలను సమీక్షించారు. ఖానాపూర్ కమ్యూనిటీ హాల్‌లో ప్రజలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమై స్థానిక అభివృద్ధి అవసరాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా యూజీడీ, మురుగునీటి వ్యవస్థ, తాగునీరు, రోడ్లు, వర్షపు నీటి కాలువలు, చెరువులు, పారిశుధ్యం, దోమలు, వీధి కుక్కలు, వీధి దీపాలు, కమ్యూనిటీ సౌకర్యాలు, శ్మశానవాటిక అభివృద్ధి తదితర సమస్యలను ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. టౌన్ ప్లానింగ్, అనధికార నిర్మాణాలు, వ్యర్థాల అక్రమ డంపింగ్, విద్యా మౌలిక సదుపాయాలు, పెన్షన్లు, దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలను కూడా వివరించారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని కమిషనర్ శ్రీజన సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి శాఖల సమన్వయంతో పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

## శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో అభివృద్ధి పనులు

**పలు మౌలిక వసతులకు కమిషనర్ జి. శ్రీజన శ్రీకారం.. పారిశుధ్యానికి కొత్త యంత్రాలు**




**సైబరాబాద్ విశాల భారతి:** శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో పలు అభివృద్ధి, మౌలిక వసతుల పనులకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. శ్రీజన శ్రీకారం చుట్టారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడంతోపాటు మున్సిపల్ సేవలను మరింత సమర్థంగా అందించేందుకు చేపట్టిన పనులను ఆమె ప్రారంభించారు.కార్యాలయ ప్రవేశ ద్వారాల వద్ద సైనేజీలు, జెండా స్థంభం, ఎంట్రన్స్ లాబీ, శానిటేషన్ విభాగం, డిప్యూటీ కమిషనర్ ఛాంబర్, సమావేశ మందిరం పునరుద్ధరణ పనులు ఇందులో ఉన్నాయి. పారిశుధ్య, నిర్వహణ కార్యకలాపాలను మరింత బలోపేతం చేసేందుకు ఒక జేసీబీ, ఐదు బాబ్‌క్యాట్లు, నాలుగు మినీ రోలర్లను కూడా కమిషనర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కమిషనర్ జి. శ్రీజన మాట్లాడుతూ.. కొత్తగా అభివృద్ధి చేసిన




సౌకర్యాలను సక్రమంగా నిర్వహించడంతోపాటు ప్రజలకు మున్సిపల్ సేవలను మరింత సమర్థంగా అందించాలని అధికారులకు సూచించారు. పౌర మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి, పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ తోపాటు జోన్ పరిధిలోని డిప్యూటీ కమిషనర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, యూబీడీ, ఎలక్ట్రికల్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇనార్బిట్ ప్రమాదంపై అనుమానాల మబ్బు

- పోలీసుల దర్యాప్తుపై ప్రశ్నలు
- ఈనెల 16న యువతి మృతి
- ఎఫ్ఐఆర్‌లో అసంపూర్తి వివరాలపై పలు సందేహాలు
- ఒత్తిళ్లకు తలొగ్గారా అనే అనుమానాలు..?


మృతురాలు భారతి ముఖి (ఫైల్)


నిందితుడు సంజుష్ (ఫైల్ )



ప్రమాదానికి కారణమైన కారు

సైబరాబాద్ - విశాల భారతి

ఈనెల 16న మధ్యాహ్నం ఇనార్బిట్ మాల్ ఎదుట జరిగిన రోడ్డు ప్రమాదంపై పలు అనుమానాలు నెలకొన్నాయి. వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొనడంతో 26 ఏళ్ల యువతి మృతిచెందగా.. ప్రమాదానికి కారణమైన వాహనం, డ్రైవర్‌కు సంబంధించిన పూర్తి వివరాల విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒక యువతి ప్రాణాలు కోల్పోయిన ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి వాస్తవాలను వెలుగులోకి తేవాల్సిన పోలీసులు.. ఎఫ్ఐఆర్‌లో నిందితుడి పేరు మాత్రమే నమోదు చేసి కీలక వివరాలను విస్మరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పోలీసుల పనితీరుపైనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 16న మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో ఇనార్బిట్ మాల్‌లోని లైఫ్‌స్టైల్ స్టోర్‌లో పనిచేస్తున్న భారతి ముఖి(26), పూజా అశోక్ అలోన్(26) భోజనం కోసం ఐటీసీ కోహినూర్ వైపు వెళ్లారు. భోజనం ముగించుకుని తిరిగి మాల్ వైపు వస్తుండగా మాల్ ఎదురుగా రోడ్డు దాటుతున్న సమయంలో టీజీ09జీ0666 నంబరు కారు వేగంగా వచ్చి భారతిని ఢీకొట్టినట్లు సమాచారం. తీవ్రంగా గాయపడిన ఆమెను వెంటనే జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై మాదాపూర్ పోలీసులు క్రైమ్ నంబర్ 1238/2026 కింద భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 106(1) ప్రకారం కేసు నమోదు చేశారు. కారు డ్రైవర్ సంజుష్ నిర్లక్ష్యంగా వాహనం నడిపినట్లు కేసులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. అయితే ఇంత తీవ్రమైన ప్రమాదంలో ఓ యువతి ప్రాణాలు కోల్పోయినప్పటికీ.. ఎఫ్ఐఆర్‌లో నిందితుడి పేరును మినహాయించి ఇతర కీలక వివరాలు లేకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**కారు యజమాని ఎవరు..?**

ప్రమాదానికి కారణమైన కారుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ రాజ్యసభ సభ్యుడి పేరు ప్రచారంలోకి రావడం కేసును మరింత సంచలనంగా మార్చింది. ప్రమాదానికి పాల్పడిన వ్యక్తి ఎంపీ కుమారుడనే ప్రచారం కూడా జరుగుతోంది. అయితే ఈ అంశంపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది. వాస్తవాలను దర్యాప్తు ద్వారా నిర్ధారించాల్సిన బాధ్యత పోలీసులదే. అయితే వాహన యజమాని, డ్రైవర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు ఎందుకు స్పష్టంగా వెల్లడించలేదన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్న. సాధారణ ప్రమాద కేసుల్లో వాహనం, డ్రైవర్ వివరాలను నమోదు చేసే పోలీసులు.. ఈ కేసులో మాత్రం ఎందుకు మౌనం వహిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**పోలీసుల పనితీరుపై చర్చ..**

ఓ యువతి ప్రాణాలు కోల్పోయిన కేసులో దర్యాప్తు ఎంత పారదర్శకంగా ఉండాలో ఈ ఘటన గుర్తు చేస్తోంది. కేసు నమోదు చేసి చేతులు దులుపుకుంటే బాధ్యత తీరినట్లుకాదని, ప్రమాదానికి అసలు కారణాన్ని వెలికితీయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని బాధిత కుటుంబ సభ్యులు అంటున్నారు. ఎఫ్ఐఆర్‌లో కీలక వివరాలు లేకపోవడం పోలీసుల నిర్లక్ష్యమా? దర్యాప్తులో లోపమా? లేక ఎవరైనా ప్రభావం చూపుతున్నారా? అన్న అనుమానాలకు ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**త్తిళ్లకు తలొగ్గారా..?**

రాజకీయంగా పలుకుబడి ఉన్న వ్యక్తుల పేర్లు ప్రచారంలోకి వచ్చిన కేసుల్లో పోలీసులపై అనుమానాలు వ్యక్తం కావడం సహజమే. ఈ కేసులోనూ అదే పరిస్థితి కనిపిస్తోందని బాధితురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. నిందితుడికి రాజకీయ సంబంధాలు ఉన్నాయన్న ప్రచారం నేపథ్యంలో పోలీసులపై ఏమైనా ఒత్తిడి ఉందా? ఉంటే ఎవరి నుంచి వచ్చింది? దర్యాప్తు అధికారులపై ప్రభావం చూపే ప్రయత్నం జరిగిందా? అన్న అంశాలపైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వారు కోరుతున్నారు. అయితే ఇవన్నీ ప్రస్తుతానికి ఆరోపణలు, అనుమానాల స్థాయిలోనే ఉన్నాయి. వాటికి ఆధారాలు ఉన్నాయా లేదా అన్నది పోలీసుల దర్యాప్తులోనే తేలాల్సి ఉంది. అందుకే కేసును కేవలం సాధారణ రోడ్డు ప్రమాదంగా పరిగణించకుండా.. దర్యాప్తులో తలెత్తుతున్న ప్రతి అనుమానాన్నీ నివృత్తి చేయాలని బాధిత కుటుంబం డిమాండ్ చేస్తోంది.

**న్యాయం కోసం ఎదురుచూపులు..**

కుమార్తెను కోల్పోయిన కుటుంబానికి న్యాయం చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. ప్రమాదానికి కారణమైన కారు, డ్రైవర్, వాహన యాజమాన్యం, సీసీ కెమెరా దృశ్యాలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు తదితర అంశాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి వాస్తవాలను బయట పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### ప్రమాదమా.. దర్యాప్తులోనే మిస్టరీనా..?

ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారా? అక్కడి సీసీ కెమెరా దృశ్యాలను సేకరించారా? ప్రమాదానికి ముందు కారు ఎంత వేగంతో వచ్చింది? డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడిపాడన్న నిర్ధారణకు పోలీసులు ఏ ఆధారాలను సేకరించారు? వాహనం ఎవరి పేరుపై ఉంది? డ్రైవర్‌కు ఆ వాహనంతో ఉన్న సంబంధమేంటి? ప్రమాద సమయంలో కారులో మరెవరైనా ఉన్నారా? వంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాల్సి ఉంది. ప్రత్యేకించి మాల్ వంటి రద్దీ ప్రాంతంలో ప్రమాదం జరగడంతో అక్కడి సీసీ కెమెరాలు కీలక ఆధారాలుగా మారే అవకాశం ఉంది. అయినప్పటికీ దర్యాప్తు పురోగతిపై పోలీసులు స్పష్టత ఇవ్వకపోవడం బాధిత కుటుంబంలో మరిన్ని అనుమానాలకు కారణమవుతోంది.



ఫిలిప్పీన్స్‌లో ఇండియన్ ఎంబసీని సందర్శించిన

# ఎన్నారై అడ్వైజరీ కమిటీ



- మనీలాలో కమిషన్ ఆన్ ఫిలిప్పీన్స్ ఓవర్సీస్ అధికారులతోనూ భేటీ
- ఉత్తమ వలస విధానాలపై చర్చలు
- గల్ఫ్ కార్మికుల కోసం మెరుగైన వలస విధానాల కోసం కృషి చేస్తాం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి వెల్లడి

విశాల భారతి

తెలంగాణ రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాల్లో ఉపాధి కోసం వలస వెళ్లిన సుమారు 15 లక్షల మంది కార్మికుల సంక్షేమం కోసం మెరుగైన వలస విధానాన్ని రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ బృందం సభ్యులు బుధవారం ఫిలిప్పీన్స్ దేశ రాజధాని మనీలాలోని ఇండియన్ ఎంబసీని సందర్శించారు... ఆ తర్వాత మనీలాలోని కమిషన్ ఆన్ ఫిలిప్పీన్స్ ఓవర్సీస్ ఉన్నతాధికారులతోనూ కమిటీ సభ్యులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ వలస విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఫిలిప్పీన్స్ దేశ వలస విధానాన్ని ఆ దేశ ఉన్నత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిటీ సభ్యులకు వివరించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ వలస విధానాన్ని అమలు చేస్తున్న ఫిలిప్పీన్స్ దేశంలో అమలులో ఉన్న విధి విధానాలను క్షుణ్ణంగా పరిశీలించి ఇదే తరహా మెరుగైన వలస విధానాన్ని గల్ఫ్ కార్మికుల కోసం అమలు చేసేందుకు కృషి చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి వెల్లడించారు.. ఫిలిప్పీన్స్ దేశ రాజధాని మనీలాలో ఉన్న ఇండియన్ ఎంబసీ అంబసడర్ హర్ష కుమార్ జైన్, ఫస్ట్ సెక్రటరీ నీలేష్ కుమార్ రాయ్ లతో వలస కార్మికుల విధానాల అంశాలపై కమిటీ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. గల్ఫ్ కార్మికులను సంక్షేమం కోసం ఫిలిప్పీన్స్ తరహా విధానాలను అమలు చేస్తామన్నరాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఎన్నారై అడ్వైజరి కమిటీ ఫిలిప్పీన్స్ దేశంలో పర్యటిస్తోంది. ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్ అంబాసిడర్ డాక్టర్ బిఎం వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, నంగి దేవేందర్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల, ప్రొఫెసర్లు విజయ్ కొర్ర, శ్రీనివాస్ జునుగురు తదితరులు ఈ బృందంలో ఉన్నారు..

## ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల పాల్వంచలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



**పాల్వంచ విశాల భారతి:** పాల్వంచలో 2026-27 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల (గెస్ట్ లెక్చరర్లు) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ తెలిపారు. కంప్యూటర్ సైన్స్ & అప్లికేషన్01, డైరీ సైన్స్ 01 విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు, అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాము అని తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో కనీసం 55% మార్కులతో, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు కనీసం 50% మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. నెట్ /సెట్ /పీహెచ్‌డీ అర్హతలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుంది. దరఖాస్తులను అవసరమైన సర్టిఫికెట్లతో కలిపి ఆగస్టు 22 సాయంత్రం 4 గంటలలోపు కొత్తగూడెంలోని ఎస్.ఆర్. గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ అటానమస్ కళాశాలలో ప్రిన్సిపాల్ కార్యాలయంలో సమర్పించాలి. ఇంటర్వ్యూలు ఆగస్టు 24 ఉదయం 10 గంటలకు కొత్తగూడెంలోని ఎస్. ఆర్. గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ అటానమస్ కళాశాలలో నిర్వహిస్తారు.

## మియాపూర్‌లో ప్రపంచ దోమల దినోత్సవ ర్యాలీ

**దోమల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించిన అధికారులు**




**సైబరాబాద్ విశాల భారతి:** ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సర్కిల్ 48 పరిధి మియాపూర్‌లో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్, ఎంటమాలజీ విభాగం సిబ్బంది పాల్గొని దోమల నియంత్రణ, ప్రజారోగ్యంపై అవగాహన కల్పించారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి దోమల వల్ల వచ్చే వ్యాధుల గురించి ప్రజలకు వివరించారు. ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉంచకుండా చూడాలని, వారానికి ఒకసారి కూలర్లు, పూలకుండీల్లో నీటిని శుభ్రం చేయాలని సూచించారు. పరిశుభ్రత పాటించడంతో పాటు మున్సిపల్ సిబ్బందికి సహకరించి ఫాగింగ్, యాంటీ లార్వా చర్యల్లో పాల్గొనాలని అధికారులు కోరారు. దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటేనే ప్రజారోగ్యాన్ని కాపాడుకోగలమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఆశా వర్కర్లు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

**విశాలభారతి, రామగుండం :** నల్గొండ జిల్లాలో ప్రిన్సిపాల్ రూపారెడ్డిని పదవ తరగతి విద్యార్థి హత్య చేసిన ఘటనను నిరసిస్తూ ప్రభుత్వ ఆమోదిత పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో గోదావరిఖని రమేష్‌నగర్‌లో గురువారం కొవ్వొత్తుల ప్రదర్శన, మానవహారం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, మంచి ప్రవర్తన పెంపొందించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తుంటారని తెలిపారు. ఉపాధ్యాయులపై ఇలాంటి దాడులు జరగడం తీవ్ర ఆందోళన కలిగించే అంశమని, ఇటువంటి ఘటనలు ఉపాధ్యాయుల మనోధైర్యాన్ని దెబ్బతీస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల రోజువారీ వ్యవహారశైలి, ప్రవర్తన, స్నేహ సంబంధాలను తల్లిదండ్రులు నిరంతరం గమనించాలని సూచించారు. విద్యార్థుల్లో పెరుగుతున్న హింసాత్మక ధోరణులను అరికట్టేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సామాజిక సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రూపారెడ్డి హత్య ఘటనను తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సంస్థలు తీవ్రంగా ఖండించాలని కోరారు. ప్రభుత్వ ఆమోదిత పాఠశాలల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు అంజారెడ్డి, రామగుండం నగరపాలక ప్రాంత అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అదర్ సండే సమ్మారావు, కొత్త శ్రీనివాసరెడ్డి, ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు చంద్రమౌళి, రవి, జ్యోతి, చాంద్, సునీత పాల్గొన్నారు.

# సమస్యల వలయంలో సర్కారీ దవాఖానా






- వేధిస్తున్న వైద్యుల కొరత
- తాగునీటికి తప్పని తిప్పలు
- మరుగున పడ్డ మరుగుదొడ్లు
- ఇక్కడి సిబ్బందిని వేరొక చోటికి డిప్యూటేషన్
- ప్రజా ఆరోగ్యాన్ని గాలికి వదిలేసిన వైనం

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాలభారతి :

మండలంలోని ప్రజలకు ప్రభుత్వ దవాఖానలో వైద్యం ఇప్పుడు అందని ద్రాక్షలా మారింది. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని గత కొంతకాలంగా వైద్యుల కొరత వేధిస్తోంది. ఇక్కడ దీర్ఘకాలికంగా పనిచేసిన వైద్యురాలు సంకీర్తన సుమారు ఐదు నెలల క్రితం పీజీ చేసేందుకు వెళ్ళింది. అప్పటినుండి ఈ వైద్యశాలకు ఆ శాఖ ఉన్నతాధికారులు డిప్యూటేషన్ పై ఆయుర్వేదిక్ వైద్యులను నియమిస్తూ కాలం వెళ్ళదిస్తున్నారు. *అల్లోపతి వైద్యానికి ఆయుర్వేదిక్* వైద్యులను నియమిస్తే వివిధ వ్యాధులతో మండల నలుమూలల నుండి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఏ విధమైన వైద్య సేవలు అందుతాయని రోగులు ప్రశ్నిస్తున్నారు.



**ఇద్దరు వైద్యులు ఉండాల్సిన చోట ఒక్కరు కూడా లేకుంటే ఎలా :?**

అశ్వాపురం మండలంలో 24 గ్రామపంచాయతీలలో, 68 హ్యాబిటేషన్ల పరిధిలో మొత్తం 43 వేల 67 మంది జనాభా ఉన్నారు. వీరి ఆరోగ్య అవసరాల కోసం మండల కేంద్రంలో 24 గంటల ఆసుపత్రి ఉంది. ఈ వైద్యశాల పరిధిలో 12 సబ్ సెంటర్లు ఉన్నాయి. వీటిల్లో 9మంది ఏఎన్ఎంలు, 12 మంది రెండవ ఏఎన్ఎంలు పనిచేస్తున్నారు. మండలానికి కేటాయించిన ల్యాబ్ టెక్నీషియన్ ను డిప్యుటేషన్ ద్వారా పినపాక పంపించారు. అలాగే ఇక్కడి ప్రజల అవసరాల కోసం మొరంపల్లిబంజరలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ ను మరలా డిప్టేషన్ ద్వారా ఇక్కడికి వేశారు. అయితే ఎందరు ఉన్నా గాని అసలు అవసరమైన వైద్యులు లేకుండా వీరందరూ ఏం చేస్తారని మండల ప్రజలు అంటున్నారు. నిపుణులైన ఇద్దరు వైద్యులు ఉండాల్సిన చోట ఒక్కరిని కూడా నియమించకుంటే ఎలా అని ప్రజలు అడుగుతున్నారు.

**మూలనపడ్డ ఆర్ఓ ప్లాంట్, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు..**

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి అవసరాల కోసం ఏర్పాటుచేసిన ఆర్ఓ ప్లాంట్ మూతపడింది. ప్రత్యామ్నాయంగా గౌతమి నగర్ కాలనీ నుండి తాగునీటి కోసం వేసిన పైప్ లైన్ కూడా పనిచేయడం లేదు. మిషన్ భగీరథ నీరు కూడా రాకపోవడంతో ఆసుపత్రి కి వచ్చే రోగులతోపాటు సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. గత కొంతకాలంగా వైద్యశాలకు పర్మినెంట్గా వైద్యులను నియమించకపోవడంతో ఆసుపత్రిలో సమస్యలు తిష్ట వేసుకుని కుర్చున్నాయని ప్రజల పేర్కొంటున్నారు.

**మరమ్మతులకు గురైన మరుగుదొడ్లు..**

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి ప్రతిరోజు 100 వరకు ఓపి ఉంటుంది. వివిధ వ్యాధులతో ఆసుపత్రికి వచ్చే వారితో పాటు వారికి సహాయకులుగా వచ్చేవారితో కలిపి అనునిత్యం 200 పై చిలుకు జనాభా, అలాగే ప్రతి నెల 10 మందికి తగ్గకుండా కాన్పుల కోసం ఆసుపత్రికి వస్తుంటారు. వీరందరి అవసరాల కోసం ఆసుపత్రిలో ఉన్న మరుగుదొడ్లు ప్రస్తుతం మరమ్మతులకు గురై వాడుకలో లేకపోవడంతో రోగులతో పాటు సహాయకులు ఇక్కడ విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. అదేవిధంగా గర్భవతులు, కాన్పుల కోసం ఆసుపత్రికి వచ్చే వారికి స్త్రీల వైద్య నిపుణులు లేకపోవడంతో తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయని ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వంతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు వైద్యులను నియమించి ప్రజా ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

# తిరగబడ్డ మమకారం' లఘుచిత్రం షూటింగ్ ప్రారంభం

**విశాలభారతి, రామగుండం :** నిరీక్షణ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'తిరగబడ్డ మమకారం' లఘుచిత్రం షూటింగ్ గురువారం గోదావరిఖని చంద్రశేఖర్‌నగర్‌లోని నిరీక్షణ స్టూడియోస్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఇప్టా జాతీయ సమితి, ప్రజా నాట్యమండలి కళాకారుడు కవ్వంపల్లి స్వామి, సీనియర్ పాత్రికేయులు దయనంద్ గాంధీ, ఎన్పీడీసీఎల్ రిటైర్డ్ ఏడీఈ కె.వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించి చిత్రీకరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో పోతుల చంద్రపాల్ రూపొందించిన లఘుచిత్రాలు సమాజాన్ని ఆలోచింపజేసే సామాజిక అంశాలతో రూపొందించబడ్డాయని తెలిపారు. అదే తరహాలో 'తిరగబడ్డ మమకారం' కూడా సమాజానికి చక్కటి సందేశాన్ని అందించేలా తెరకెక్కుతోందన్నారు. కన్నవాళ్లను నిరాశ్రయులను చేసినప్పుడు.. తల్లిదండ్రులు తమ మమకారాన్ని చంపుకుని తిరగబడితే ఏర్పడే పరిస్థితులను ఈ చిత్రంలో చూపించనున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రుల పట్ల పిల్లలు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరాన్ని తెలియజేసేలా ఈ చిత్రం ఉంటుందని తెలిపారు. ఇటీవల లఘుచిత్రాల పేరుతో కొందరు ఇబ్బందికర టైటిల్స్ తో, అభ్యంతరకర దృశ్యాలతో చిత్రాలను రూపొందిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దర్శకులు, నిర్మాతలు వ్యక్తిగత క్రమశిక్షణ పాటిస్తూ సమాజానికి ఉపయోగపడే, సందేశాత్మక చిత్రాలను రూపొందించాలని సూచించారు. 'తిరగబడ్డ మమకారం'కు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. కాగా గతంలో పలు సామాజిక అంశాలపై లఘుచిత్రాలను రూపొందించిన పోతుల చంద్రపాల్ ఈ చిత్రానికి రచన, దర్శకత్వ బాధ్యతలు చేపట్టగా, సీనియర్ పాత్రికేయులు మేజిక్ రాజా, పోతు శంకరయ్య, సిరిపురం శ్రీనివాస్, సతీష్, శ్రీలత, రజిత, వేదశ్రీ, అస్మిత్ పాల్గుణ, రియా వృంద తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. తిప్పబత్తిని అంజయ్య మేకప్‌మెన్‌గా, కోడైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.





# మనసా వాచా స్వరాలతో..

‘బేబీ’ వంటి సక్సెస్‌ఫుల్ మూవీ తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న తాజా రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ‘ఎపిక్-ఫస్ట్ సెమిస్టర్’. ‘90s వెబ్ సిరీస్’ ఫేమ్ ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకురానుంది. గురువారం ఈ సినిమా నుంచి ‘మనసా వాచా’ అనే మూడో గీతాన్ని విడుదల చేశారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరచిన ఈ గీతాన్ని ప్రముఖ గాయకులు చిత్ర, ఎస్పీ చరణ్ ఆలపించారు. శ్రీహర్ష ఈమని రచన చేశారు. ప్రేమ, విరహం, ఎడబాటు వంటి భావోద్వేగాలకు అద్దం పడుతూ ఈ పాట సాగింది. ప్రేమికుల మానసిక సంఘర్షణను ఈ పాటలో ఆవిష్కరించారు. లండన్ నేపథ్యంలో సాగే న్యూఏజ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇదని, వినోదానికి పెద్దపీట వేశామని మేకర్స్ తెలిపారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.